నేటి కందం- నేటికి అందం



సుందర తర దేశమునకు
చెందిన వారందరికిని చెలువము మీరన్
నందముతో తెరిచెదరట
పొందికగా బాంక్ ఎకౌంట్లు పూత పథములోన్ !!

అందరికీ బాంక్ ఎకౌంట్లు
తెరవడానికి బృహత్తర పథకం

-రాధశ్రీ
సెల్:9494481210





# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com



చురక

చిగాసీ కంపెనీలో
చితిమంటల విస్ఫోటన
ప్రాణాలను బలిగొన్నది
ప్రమాదపు దుర్ఘటన
పనులుచేసే కార్మికుల
ప్రాణాలకు ఏది రక్ష
భద్రతా అమలు లేని
పరిశ్రమలకు ఏది శిక్ష

-వేల్పుల నారాయణ
9440433475





హైదరాబాద్ బుధవారం 2-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:249 పేజీలు:6 వెల: రూ.1/-


## "తెలంగాణ రైజింగ్ - 2047" లక్ష్యం దిశగా కార్యాచరణ ప్రణాళిక



హైదరాబాద్, జూలై 01 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );:: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "తెలంగాణ రైజింగ్ - 2047" లక్ష్యం దిశగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సమాయత్తం చేసేందుకు విభాగాల వారీగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ "మిషన్ కర్మయోగి" అధికారుల బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ ఎస్ అధికారులతో సమావేశం అయ్యింది. సమావేశంలో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బందికి వారిలో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు మిషన్ కర్మయోగి చేపట్టిన శిక్షణా కార్యక్రమాలను, కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ అడ్మినిస్ట్రేషన్ సభ్యురాలు డాక్టర్ అల్కా మిట్టల్ వివరించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ మిషన్ కర్మయోగి సహకారంతో మన రాష్ట్రంలో కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బందికి పలు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు ఆయా శాఖల వారీగా తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బందికి ఈ కార్యక్రమం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని తద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు సమర్థవంతంగా అమలైయ్యేందుకు ఈ శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడుతాయని అన్నారు. ఇదివరకే తెలంగాణ రాష్ట్రంలో డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీ, ఫారెస్ట్ అకాడమీ, ఎక్సైజ్ అకాడమీ తదితర సంస్థలు సమర్థవంతంగా పలు శిక్షణా కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ సిబ్బందికి అధికారులకు మార్గనిర్దేశనం చేస్తున్నాయని సి.ఎస్ తెలిపారు. ఈ సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మీడియా అకాడమీ తరపున ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టామని ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక వివరించారు. అదే విధంగా సమాచార శాఖ అధికారులకు, సిబ్బందికి కూడా వృత్తి నైపుణ్యం పెంచే శిక్షణా కార్యక్రమాలు చేపడుతామని ఆమె తెలిపారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, రెవెన్యూ (సిటి & ఎక్సైజ్) ముఖ్య కార్యదర్శి రిజ్వీ, జిఎడి (సర్వీసెస్) కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, జిఎడి కార్యదర్శి రఘునందన్ రావు, రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, పిసిసిఎఫ్ సువర్ణ, మహిళా సంక్షేమ కార్యదర్శి అనితా రామచంద్రన్, హెచ్ఎండిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సెర్ప్ సిఇఓ దివ్య, హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతమ్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం..

హైదరాబాద్, జులై 1: నగరంలో పలు చోట్ల భారీ వర్షం కురుస్తోంది. ఇప్పటికే భారత వాతావరణ శాఖ హైదరాబాద్ నగరానికి యెల్లో అలర్ట్ ప్రకటించింది. ఈ హెచ్చరిక జులై 4వ తేదీ వరకు కొనసాగనుంది.

అయితే, ఈరోజు సాయంత్రం ఒక్కసారిగా వర్షం ఊపందుకుంది. ఈ వర్ష ప్రభావానికి గురైన ప్రాంతాల్లో బల్కంపేట, బేగంపేట, ఎస్.ఆర్.నగర్, అమీర్పేట్, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాధాపూర్ ప్రధానంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండటం వల్ల వర్షాలకు తోడు గాలుల తీవ్రత ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తోంది.

ప్రజలు వర్ష పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ సూచనలు పాటించి, అత్యవసర పరిస్థితులలో మాత్రమే బయటకు రావాలని సూచించారు.

## పాశమైలారం మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం:సిఎం రేవంత్ రెడ్డి



సంగారెడ్డి జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పాశమైలారం బాధిత కుటుంబాలకు ఆర్థికంగా తక్షణ సాయం కల్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సిగాచి ప్రమాదం దురదృష్టకరమని, అత్యంత విషాద ఘటన అని సానుభూతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తక్షణమే రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50 వేలు సాయం అందించాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇప్పిస్తామని, క్షతగాత్రుల వైద్య ఖర్చులు తామే భరిస్తామన్న ఫ్యాక్టరీ యాజమాన్యం పేర్కొందన్నారు. సిగాచి పరిశ్రమ ప్రమాద స్థలాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో రేవంత్ బాధితులను పరామర్శించారు. సిఎం వెంట మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. పాశమైలారంలో సిగాచిని పరిశీలించిన అనంతరం అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష జరిపారు. పరిశ్రమ అనుమతులు, భద్రతా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ బోర్డు సభ్యులు ఎవరా.. అని అడిగి తెలుసుకున్నారు.

పరిశ్రమను తనిఖీ చేశారా అని ఫ్యాక్టరీస్ డైరెక్టర్‌ను రేవంత్ ప్రశ్నించారు. తాజా ప్రమాదంపై నిపుణులతో విచారణ జరిపి పూర్తి నివేదిక ఇవ్వాలని సిఎం ఆదేశించారు. ఇప్పటికే తనిఖీ చేసిన అధికారులతో కాకుండా కొత్త వారితో విచారణ జరిపించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇది నష్టపరిహారం కాదని అధికారులకు రేవంత్ తెలిపారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని, ఖర్చును భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మృతులు, గాయపడిన వారి పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రమాదానికి సంబంధించి ప్రాథమిక సమాచారం తమ దగ్గర ఉందని, విచారణ జరిగి నివేదిక వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

## ప్రముఖ సైకాలజిస్ట్ బి.వి.పట్టాభిరామ్ కన్నుమూత

హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రముఖ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు బివి పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. సోమవారం ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 'రావ్ సాహెబ్' భావరాజు సత్య నారాయణ సంతానంలోని 15 మంది ఒకరు పట్టాభిరామ్. కౌమార దశలో కాలి వైకల్యంతో న్యూనత భావాన్ని జయించి తానని తాను ఇంద్రజాలికుడిగా, రచయితగా తీర్చిదిద్దుకున్నారు. కాకినాడలో చదువుతున్న రోజుల్లో ఎంబేర్ రావు అనే ఇంద్రజాలికుడి దగ్గర ఆ విద్యను నేర్చుకున్నారు. 1970 నాటికి ఆయన పూర్తిస్థాయి ఇంద్రజాలకుడిగా ఎదిగారు. 1984లో హైదరాబాద్‌లో కళ్లకు గంతలు కట్టుకొని రవీంద్ర భారతి నుంచి చార్మినార్ వరకూ స్కూటర్ నడిపి. ఇంద్రజాల విద్యలో తెలుగునేలపై కొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఆ తర్వాత తన వద్ద ఉన్న విద్యతో ప్రజలకు ఎంతో మేలు చేశారు. దూరదర్శన్‌లో కొన్ని సీరియల్స్‌తో పాటు పలు సినిమాల్లో ఆయన నటించారు. ఇక పట్టాభిరామ్‌కు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ భార్య కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా పేరు పొందారు. ఖైరతాబాద్‌లోని స్వగృహంలో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం అక్కడ ఉంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మహాప్రస్థానంలో పట్టాభిరావ్ అంత్యక్రియలు జరగనున్నాయి.

## స్పోర్ట్స్ స్కూళ్ల ఎంపికలో పైరవీలకు తావు లేదు

-క్రీడా శాఖలో సమూల మార్పు
-విధుల్లో అలసత్వం వద్దు
-కోచులకు పునఃశ్చరణ తరగతులు
- స్పోర్ట్స్ స్కూళ్ల పనితీరు మెరుగుపడాలి
-క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ క్రీడా పాఠశాలల్లో సమూల మార్పు జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర క్రీడ యువజన సర్వీసులు మరియు పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.



ఈరోజు హకీంపేటలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలను స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఈరోజు నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాల ఎంపికల ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ క్రీడా పాఠశాలలు హకీంపేట కరీంనగర్ అదిలాబాదుల లో క్రీడా పాఠశాల నిర్వహణలో సమూలమైన మార్పులు జరగాల్సిన అవసరం ఉందని మూడు నెలల్లో వీటి పనితీరును మెరుగుపరిచి చూపిస్తామని ఆయన ప్రకటించారు. క్రీడా పాఠశాలల ఎంపికలో ఎటువంటి పైరవీలకు ఆస్కారం ఉండకూడదని, పాఠశాలల విద్యార్థుల ఎంపికలో ఎటువంటి ఒత్తిడిలు వచ్చిన పారదర్శకంగా వ్యవహరించి క్రీడల్లో ప్రతిభ ఉన్న వారిని ఎంపిక చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కరీంనగర్ అదిలాబాద్ లో ఉన్న పాఠశాలల కూడా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ సందర్భంగా విద్యార్థుల్లో తల్లిదండ్రులు అందరితో ఆయన మాట్లాడుతూ, ఎంపిక కానీ పిల్లలను క్రీడలకు దూరం చేయకుండా వారిని క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో క్రీడా పాఠశాలలు అకాడమీ లలో విద్యార్థుల ఎంపిక తర్వాత వారికి మెరుగైన శిక్షణ ఇచ్చే విధంగా కోచులు సిబ్బంది శ్రద్ధ వహించాలన్నారు. నూతన క్రీడా విధానం అనుసరించి అంచలంచలుగా కోచులు మరియు క్రీడా సిబ్బంది సంఖ్యను పెంచుకుంటూ పోవడమే కాకుండా, ప్రతి సంవత్సరం కోచులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించి వారి పనితీరును మెరుగు పరుస్తామని అన్నారు. ఫలితాలు సాధించే కోచులను ప్రోత్సహిస్తూనే, ఫలితాలు తీసుకురాని, క్రీడా శిక్షకులను ఉపేక్షించబోమని ఆయన అన్నారు. ఇకముందు స్పోర్ట్స్ స్కూల్ లను అకాడమీ లను ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన స్పోర్ట్స్ స్కూల్ క్యాంటీన్, కిచెన్ ను పరిశీలించి మరింత శుభ్రతను పాటించాలని పిల్లలకు అందించే ఆహారం మరింత పరిశుభ్రంగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పాటు లైన్లో నిలబడి, భోజనం తీసుకోవడమే కాకుండా వారితో కలిసి భోజనం చేశారు. ప్రతి 10 సంవత్సరాల నుండి క్రీడా శాఖ పనితీరు కుంటుపడిందని, సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అన్ని రంగాల్లో మాదిరిగానే క్రీడా శాఖలో మార్పు మొదలైందని, సీఎం రేవంత్ రెడ్డి గారి ఆలోచన అందుకొని క్రీడాభివృద్ధి కోసం శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి టీ మమత, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు, స్పోర్ట్స్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : ఎమ్మెల్యే తలసాని





హైదరాబాద్, జులై 1:బల్కంపేట ఎల్లమ్మ తల్లి దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణానికి హాజరయ్యారు. ముందుగా ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తుల కోరికలు తీర్చే అమ్మగా పూజలు అందుకుంటున్న ఎల్లమ్మ తల్లి కళ్యాణానికి ప్రతి ఏటా లక్షలాది మంది వివిధ ప్రాంతాల నుండి వస్తారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 సంవత్సరాలలో ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు.

ఇక్కడకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం వలన అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగిందని తదనుగుణంగా ఆలయ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు అమ్మవారి కళ్యాణాన్ని ఆలయం లోపల నిర్వహించే వారని, కొందరికి మాత్రమే కళ్యాణం వీక్షించే అవకాశం ఉండేదని వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆలయం ముందు భారీ రేకుల షెడ్డు నిర్మించి షెడ్డు కింద కళ్యాణాన్ని నిర్వహిస్తూ వస్తున్నట్లు వివరించారు.

బుధవారం నిర్వహించే అమ్మవారి రథోత్సవం కూడా ఎలాంటి ఆంక్షలు, ఆటంకాలు లేకుండా జరిగేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, హన్మంతరావు, ఆకుల హరికృష్ణ, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, నామన సంతోష్ కుమార్, శ్రీహరి, కొలన్ భూపాల్ రెడ్డి, బాసా లక్ష్మి, లక్ష్మి, బలరాం, గోపిలాల్ చౌహాన్, వనం శ్రీనివాస్, నారాయణ రాజు, సురేందర్ తదితరులు ఉన్నారు.

## పాశమైలారం పేలుడు ఘటనలో 45కు పెరిగిన మృతుల సంఖ్య..

- గుర్తుపట్టలేని స్థితిలో 20 మృతదేహాలు.. కొనసాగుతున్న సహాయక చర్యలు

పటాన్‌చెరు జూలై 1 (ఎఇఎక్స ప్రెస్ న్యూస్ );: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మాస్యూటికల్ కంపెనీలో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నది. రియాక్టర్ పేలుడుతో ఇప్పటివరకు 45 మంది మరణించారు. వివిధ దవాఖానల్లో మరో 31 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే మరణించినవారిలో ఎక్కువ మంది తమిళనాడు, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందినవారే ఉన్నారు. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను గుర్తించగా, మరో 20 గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. సోమవారం జగన్మోహన్, రామ్‌సింగ్ రాజ్‌బర్, శశిభూషణ్ కుమార్ మృతిచెందినట్లు గుర్తించగా, తాజాగా మరో ఆరుగురి పేర్లను అధికారులు ప్రకటించారు. లగ్నజిత్ దౌరి, బీ.హేమ సుందర్, రుక్సానా కతూన్, జీ.నికిల్ రెడ్డి, నాగేశ్వర్ రావు, పోలిషెట్టి ప్రసన్నగా గుర్తించారు. డీఎన్ఏ పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించే అవకాశం ఉన్నది. అయితే మృతుల సంఖ్య 55కు పెరిగే అవకాశం ఉంది.

## అడ్మిషన్స్‌లో లక్ష్యం చేరుకోవాలి.. ఇంటర్ విద్యపై ప్రిన్సిపాలతో సమీక్షలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల, జులై 1:(నేటినిజం ప్రతినిధి): జూనియర్ కళాశాలలో మెరుగైన బోధన అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్ విద్యపై ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమీక్ష నిర్వహించారు.

జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్, ఇంటర్ పరీక్షా ఫలితాలు, జూనియర్ కళాశాలలో మైనర్ రిపేర్, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు, పోటీ పరీక్షల శిక్షణ, ఫైర్ సేఫ్టీ, ఇతర మౌలిక సదుపాయాలు తదితర అంశాల పై కలెక్టర్ చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు.

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 10 ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలో మొదటి సంవత్సరం 1777 అడ్మిషన్స్ సాధించడం లక్ష్యం కాగా.. 1116 మంది విద్యార్థులు (63% ) ఎన్‌రోల్ చేసుకోవడం జరిగిందని అన్నారు. జూనియర్ కళాశాలలో అడ్మిషన్స్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

జూనియర్ కళాశాలలో సివిల్ వర్క్, విద్యుత్ సరఫరా, పారిశుధ్య, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పన, మైనర్ రిపేర్ పనులకు ప్రభుత్వం 1 కోటి 80 లక్షల రూపాయలు మంజూరు చేసిందని, నిధులను సద్వినియోగం చేసుకుంటూ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జూనియర్ కళాశాలలో అందించే విద్య నాణ్యత పెరగాలని అన్నారు. లెక్చరర్స్ సకాలంలో కళాశాలకు హాజరు కావాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన జరగాలని అన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో సప్లమెంటరీ పరీక్షలు ముగిసిన తర్వాత వేములవాడ ,ఎల్లారెడ్డి పేట, ఇల్లంతకుంట కళాశాలలో ఫలితాలు తక్కువగా వచ్చాయని తెలిపారు.

## కల్వర్టును ఢీ కొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. పది మందికి గాయాలు

నల్గొండ, జులై 1: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రహదారి డివైడర్‌ను ఢీ కొట్టడంతో 10 మంది ప్రయాణీకులు గాయపడ్డారు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులోని 65వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. ప్రయాణీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కేవీఆర్ ట్రావెల్ ప్రైవేట్ బస్సు సోమవారం అర్ధరాత్రి 30 ప్రయాణీకులతో విజయవాడ నుండి హైదరాబాద్‌కు బయల్దేరింది. మార్గమధ్యంలో అయిటిపాముల గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో బస్సు కల్వర్టు డివైడర్‌ను ఢీకొట్టింది. అప్పటికే గాఢ నిద్రలో ఉన్న ప్రయాణీకులు మేలుకుని బస్సులో నుండి దిగేందుకు ప్రయత్నించగా డోర్ లాక్ కావడంతో బయటకు రాలేకపోయారు. సమాచారం తెలుసుకున్న కట్టంగూర్ 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అత్యవసర డోర్‌ను ధ్వంసం చేసి ప్రయాణీకులను బస్సు లోంచి కిందికి దింపారు. గాయపడ్డ వారిని 108 వాహనాల్లో నార్కట్‌పల్లి కామినేని దవాఖానకు తరలించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్, జులై 1:ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అలియాబాద్ మున్సిపల్ యాడారంకు చెందిన వీరస్వామి గౌడ్‌కు మంజూరైన రూ.45వేల సీఎం రిలిఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే మల్లారెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, తూంకుంట మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, తూంకుంట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాజు యాదవ్, నాయకులు గోనె హరిమోహన్ రెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ మండల్ యూత్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, హనుమాన్ దాస్, తురాయి వెంకటేష్, యూనఫ్ బాబా పాల్గొన్నారు.

# గ్రహాంతరవాసులు ఉన్నారా ?

## (02 జూలై "ప్రపంచ గుర్తించబడని ఎగిరే వస్తువుల (యూఎఫ్ఓ) దినం" సందర్భంగా)

అనేక సైన్స్ సంబంధ కాల్పనిక కథలు, సినిమాలు, నవలలు, టీవీ సీరియల్స్‌ను చూస్తున్న మనం ఎన్నడూ గుర్తించని వస్తువులను అంతరిక్షంలోంచి రావడం లేదా ఎగిరిపోవడం చూస్తున్నాం, ఉత్సుకతతో తిలకించి ఆశ్చర్య పోతున్నాం. అంతరిక్షంలో మానవ సంబంధం లేని గ్రహాంతరవాసులకు చెందిన ఫ్లయింగ్ సాసర్స్ లేదా డిస్కులను చూశామని చెప్పే వ్యక్తులను గూర్చి వింటున్నాం. ఇలాంటి మానవుడు ఇప్పటి వరకు 'గుర్తించని ఎగిరే వస్తువు'లను "అన్ఐడెంటిఫైడ్ ఫ్లయింగ్ ఆబ్జెక్ట్స్ లేదా యూఎఫ్ఓ" అని పిలుస్తూ, పలు పరిశోధనలు చేస్తున్నాం. 02 జూలై 1947 రోజున న్యూమెక్సికో సమీపాన "రూజ్వెల్ యూఎఫ్ఓ ఫ్లైయింగ్ డిస్క్ క్రాష్" కావడం జరిగిందని, ఇది గ్రహాంతరవాసులకు చెంది ఉండవచ్చని ప్రచారం చేస్తూ ప్రతి ఏట 02 జూలై రోజున " యూఎఫ్ఓ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది.

ప్రపంచ యూఎఫ్ఓ దినం కార్యక్రమాలు:

2020 ఏప్రిల్‌లో అమెరికన్ రక్షణ శాఖ విడుదల చేసిన మానవ నిర్మితం కాని, భూమి ప్రమేయం లేని, అంతరిక్షంలో ఎగిరే వస్తువులను గురించి కొన్ని ఆసక్తికర విషయాలను బయట పెట్టడం జరిగింది. ప్రపంచ యూఎఫ్ఓ దినం వేదికగా గ్రహాంతరవాసులు లేదా వస్తువుల పట్ల అవగాహన కల్పించడం, వీటికి సంబంధించిన సినిమాలు లేదా టీవీ సీరియల్స్ చూడడం, సైన్స్ ఫిక్షన్ సినిమాలు/ డాక్యుమెంటరీలను చూపడం, వాటి గురించి చర్చించడం, పరిశోధనలు కొనసాగించడం లాంటివి ఏర్పాటు చేయవచ్చు.

ఇప్పటికీ యూఎఫ్ఓల పట్ల కచ్చితమైన రుజువులు లేనప్పటికీ, అవి ఉన్నాయనే భావనలు మాత్రం ప్రచారంలో ఉన్నాయి. ఏలియన్, ఈటీ, మెన్ ఇన్ బ్లాక్, ది థింగ్ లాంటి సినిమాలను చూస్తే యూఎఫ్ఓల పట్ల కొంత అవగాహన కలుగవచ్చు.

–డా॥ మధుసూదన్ రెడ్డి బుర్ర
9949700037

# వ్యూహాత్మక, నూతన రంగాల్లో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ (ఆర్డీఐ) పథకానికి క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, జులై 1:భారత్‌లో పరిశోధన, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చేసే ప్రయత్నాల్లో భాగంగా.. రూ.1 లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌తో రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ (ఆర్డీఐ) పథకానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది.

న్యూఢిల్లీ, జులై 1:ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో, పరిశోధనను వాణిజ్యీకరించడంలో ప్రైవేటు రంగం పోషిస్తున్న కీలకపాత్రను గుర్తిస్తూ.. ఆర్డీఐలో ప్రైవేటు రంగం పెట్టుబడులను ప్రోత్సహించడానికి తక్కువ లేదా సున్నా వడ్డీ రేట్లతో దీర్ఘకాల వ్యవధిలో ఫైనాన్సింగ్, రీఫైనాన్సింగ్‌ను అందించడమే ఆర్డీఐ పథకం లక్ష్యం. నిధుల సమీకరణలో ప్రైవేటు రంగం ఎదుర్కొంటున్న అవరోధాలు, సవాళ్లను అధిగమించడానికి ఇది తోడ్పడుతుంది. అలాగే నూతన, వ్యూహాత్మక రంగాల్లో ఆవిష్కరణలను సులభతరం చేయడానికి, సాంకేతికత స్వీకరణను ప్రోత్సహించడానికి, పోటీతత్వాన్ని పెంచడానికి వృద్ధి, రిస్క్ క్యాపిటల్ అందించడమే ఈ పథకం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ప్రధానమంత్రి అధ్యక్షతన ఉండే అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) పాలకమండలి ఆర్డీఐ పథకానికి అవసరమైన విస్తృత వ్యూహాత్మక దిశానిర్దేశం చేస్తుంది. పథకం మార్గదర్శకాలను ఏఎన్ఆర్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) ఆమోదిస్తుంది. అలాగే ద్వితీయ శ్రేణి ఫండ్ మేనేజర్లు, నూతన రంగాల్లో చేపట్టే ప్రాజెక్టుల పరిధి, వాటి రకాన్ని సిఫార్సు చేస్తుంది. కేబినెట్ కార్యదర్శి నాయకత్వంలోని కార్యదర్శుల సాధికారత బృందం (ఈజీవోఎస్) పథకంలో చేసే మార్పులు, రంగాలు, ప్రాజెక్టుల రకాలను ఆమోదిస్తుంది. అలాగే ద్వితీయ శ్రేణి ఫండ్ మేనేజర్ల పనితీరు, పథకం అమలు సమీక్షకు బాధ్యత వహిస్తుంది. ఆర్డీఐ పథకాన్ని అమలు చేయడంలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్టీ) నోడల్ విభాగంగా పనిచేస్తుంది.

ఆర్డీఐ పథకంలో రెండంచెల నిధుల విధానం ఉంటుంది. మొదటి అంచెలో ఏఎన్ఆర్ఎఫ్ పరిధిలో ప్రత్యేక ప్రయోజన నిధి (ఎస్‌పీఎఫ్)ను ఏర్పాటు చేస్తారు. ఇది నిధులకు సంరక్షకురాలిగా వ్యవహరిస్తుంది. వివిధ ద్వితీయ శ్రేణి మేనేజర్లకు ఎస్‌పీఎఫ్ నుంచి నిధులు కేటాయిస్తారు. ఇది ప్రధానంగా దీర్ఘకాలిక రాయితీ రుణాల రూపంలో ఉంటుంది. ఆర్ఎండ్‌డీ ప్రాజెక్టులకు ద్వితీయ శ్రేణి ఫండ్ మేనేజర్లు ద్వారా ఆర్ఎండ్‌డీ ప్రాజెక్టులకు అందించే నిధులు తక్కువ వడ్డీ లేదా సున్నా వడ్డీ రేట్లతో దీర్ఘకాలిక రుణం రూపంలో ఉంటాయి. ఈక్విటీ రూపంలో సైతం ఈ రుణాలను ముఖ్యంగా అంకుర సంస్థలకు అందించవచ్చు. డీప్ టెక్ అంకుర సంస్థలకు నిధులు (ఎఫ్ఓఎఫ్), లేదా ఆర్డీఐకు ఉద్దేశించిన ఇతర ఎఫ్ఓఎఫ్ సహకారాన్ని సైతం పరిగణనలోకి తీసుకుంటారు.

ప్రైవేటు రంగంలో దీర్ఘకాల, అందుబాటులో ఉండే రుణాల కీలక అవసరాన్ని గుర్తించి పరిష్కారం చూపించడం ద్వారా ఆర్డీఐ పథకం స్వావలంబన, అంతర్జాతీయ పోటీ తత్వాన్ని పెంపొందిస్తుంది. తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ సాధించే దిశగా చేస్తున్న ప్రయాణంలో దేశానికి అనుకూలమైన ఆవిష్కరణల వ్యవస్థను సులభతరం చేస్తుంది.

# 'ప్రజా పరిపాలనలో శ్రేష్ఠత్వ సాధనకు ప్రధానమంత్రి పురస్కారాలు-2025 పథకాన్ని' ప్రకటించిన డీఏఆర్‌పీజీ

న్యూఢిల్లీ, జులై 1:'ప్రజా పరిపాలనలో శ్రేష్ఠత్వ సాధనకు ప్రధానమంత్రి పురస్కారాలు –2025 పథకాన్ని' కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్రాలు, జిల్లాల కోసం పాలనాపరమైన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) ఈ రోజు నోటిఫై చేసింది.

ప్రధానమంత్రి పురస్కారాల కోసం నమోదు చేసుకోవడం, నామినేషన్లను దాఖలు చేయడం కోసం ఒక వెబ్ పోర్టల్‌ను లాంఛనంగా ఈ ఏడాది అక్టోబరు 2న ప్రారంభించనున్నారు. ఆ తరువాత నుంచి నామినేషన్లను దాఖలు చేయవచ్చు.

భారత్ సంపూర్ణాభివృద్ధి దిశగా చేపట్టే ప్రయత్నాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ పురస్కారాల పథకాన్ని ప్రారంభించారు. సమగ్ర కార్యాచరణపై దృష్టిని కేంద్రీకరించడం దీని ముఖ్యోద్దేశం. దీనిలో భాగంగా సమాచార, రాతపూర్వక ఆధారాలను సమీకరించడం, సుపరిపాలనలతో పాటు నాణ్యత సంబంధిత అంశాలపై శ్రద్ధ తీసుకొన్నారు. ఈ పథకంలో 11 ప్రాధాన్య రంగ పథకాల అమలుపై ఉమ్మడి సమీక్షను నిర్వహిస్తారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 సంవత్సరం నుంచి పీఎమ్ ఎక్సెలెన్స్ అవార్డుల భావన, స్వరూపం.. ఈ రెండిటిలోనూ విప్లవాత్మక మార్పులు చోటు చేసుకొన్నాయి. సంఘటిత పోటీని, నవకల్పనను, అతి ఉత్తమ అభ్యాసాల అనుకరణ, సంస్థాగత ప్రణాళికలో భాగంగా ఆ అభ్యాసాలను సంధానించడాన్ని ప్రోత్సహించం ఈ పథకం ఉద్దేశాలు. ఈ దృష్టికోణంలో భాగంగా, పరిమాణం పరమైన లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి బదులు సుపరిపాలన, గుణాత్మక కార్యసాధనకు తోడు వరుసలోని చివరి వ్యక్తికి కూడా లబ్ధిని విస్తరించడం.. వీటిపై శ్రద్ధ వహిస్తారు. లక్షిత వ్యక్తిగత లబ్ధిదారులు, అందరికీ లబ్ధిని సమకూర్చడం.. ఈ ప్రాతిపదికలతో జిల్లా కలెక్టర్ పనితీరును గుర్తించడం ఈ సంవత్సర పురస్కారాల పథకం ఉద్దేశంగా ఉంది. ఈ అంశాలపై దృష్టిని కేంద్రీకరిస్తూ, పురస్కారాల కోసం దరఖాస్తులను మూడు కొలమానాలతో మూల్యాంకనం చేయనున్నారు. ఆ మూడు కొలమానాలలో– సుపరిపాలన, రాశి, వాసి పరమైన కోణాల్లో చూస్తారు.

'ప్రజా పరిపాలనలో శ్రేష్ఠత్వ సాధనకు ప్రధానమంత్రి పురస్కారాలు –2025 పథకం'లో అన్ని జిల్లాలూ పాలుపంచుకొంటాయని భావిస్తున్నారు.

2025 సంవత్సరానికి, మూడు కేటగిరీల్లో ప్రభుత్వోద్యోగుల తోడ్పాటుకు గుర్తింపును ఇవ్వాలనేది ప్రజా పరిపాలనలో శ్రేష్ఠత్వ సాధనకు ప్రధానమంత్రి పురస్కారాలు –2025 పథకం' ఉద్దేశం. ఆ మూడు కేటగిరీల్లో :

ఒకటో కేటగిరీ (జిల్లాల సమగ్రాభివృద్ధి) కోసం పరిశీలన కాలం 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 సెప్టెంబరు 30 వరకు లెక్కలోకి తీసుకొంటారు.

రెండో కేటగిరీ (ఆకాంక్షాత్మక) తో పాటు మూడో కేటగిరీ (నవకల్పనల) కోసం పరిశీలన కాలం 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 సెప్టెంబరు 30 వరకు ఉంటుంది.

మూల్యాంకన ప్రక్రియలో స్క్రీనింగ్ కమిటీ ద్వారా (ప్రథమ, ద్వితీయ దశలకు) తుది పరిశీలనకు జిల్లాలు లేదా సంస్థల ఎంపిక, నిపుణుల కమిటీ ద్వారా మూల్యాంకనంతో పాటు సాధికార కమిటీ.. ఇవి భాగంగా ఉంటాయి. పురస్కారాల కోసం ఏర్పాటు చేసిన సాధికార కమిటీ సిఫారసులు ప్రధానమంత్రి ఆమోదానికి లోబడి ఉంటాయి.

ప్రధానమంత్రి పురస్కారాలు–2025లో ట్రోఫీ ప్రశంసాపత్రం పురస్కారాన్ని అందుకొనే జిల్లాకు లేదా సంస్థకు రూ.20 లక్షలు అందిస్తారు. ఈ మొత్తాన్ని ప్రాజెక్టు లేదా కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఉపయోగించడంగాని, లేదా ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏదైనా రంగంలో వనరుల లోటును తీర్చడానికిగానీ వినియోగించాల్సి ఉంటుంది.

# రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి : హెచ్ఆర్సీ కమిషన్ చైర్మన్



నల్గొండ, జులై 1: ప్రభుత్వ ఆసుపత్రులకు వివిధ సమస్యలతో వచ్చే పేషెంట్లకు డాక్టర్లు నాణ్యమైన వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఇవాళ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ సందర్శించారు. హాస్పిటల్ లోని మెడికల్, క్యాజువాలిటీ, ఐసీయూ, మెడికల్ కేర్, జనరల్ సర్జికల్ వార్డు, మెడికల్ స్టోర్, డయాలసిస్, ఎక్స్ రే తదితర వార్డులను, ఆస్పత్రి పరిసరాలను, రికార్డులను పరిశీలించారు.

చికిత్స పొందుతున్న ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్లు తదితరులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు కావలసిన అన్ని రకాల మందులు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ పట్ల రోగుల్లో మంచి నమ్మకం కలిగించే విధంగా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీం అక్తర్

చౌటుప్పల్ పట్టణంలోని బంగారిగడ్డలో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి భవన సముదాయం నిర్మాణం పనులను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీం అక్తర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ హాస్పటల్ స్థితిగతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్మాణం పనులను నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఆస్పత్రి భవన సముదాయం నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయని, త్వరగా పనులు పూర్తి చేసి అప్పగించడం జరుగుతుందని కమిషన్ చైర్మన్ కు కాంట్రాక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి మనోహర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ లక్ష్మీపురం యశోద, హాస్పిటల్ సూపరింటెంట్ చిన్నా నాయక్, డాక్టర్ అలివేలు, డాక్టర్ చింతకింది కాటమరాజు తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఐక్య విద్యార్థి సంఘాల నేతల అక్రమ అరెస్ట్ దారుణం : తుంగ బాలు

హైదరాబాద్, జులై 1:విద్యారంగ సమస్యలపై ఆందోళనకు సిద్ధమైన ఐక్య విద్యార్థి సంఘాల నేతల అక్రమ అరెస్టును బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తుంగబాలు తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన విద్యార్థి సంఘనేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకుండా ముఖ్యమంత్రి తన దగ్గరే పెట్టుకుని విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు.

దాదాపు రెండేళ్ల నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా రేవంత్ సర్కార్ వారికి విద్యను దూరం చేస్తోందని దుయ్యబట్టారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి ,విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఇతర విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# పదేళ్ల డిజిటల్ ఇండియా ప్రస్థానానికి ప్రధాని ప్రశంసలు

న్యూఢిల్లీ, జులై 1:విజయవంతంగా పదేళ్లు పూర్తి చేసుకున్న డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు. దశాబ్దం తర్వాత ఎన్నో జీవితాల్లో మార్పులు తీసుకొచ్చిన, నవయుగ సాధికారతకు నాంది పలికిన ప్రయాణానికి మనం సాక్షులుగా నిలిచామని ప్రధాని పేర్కొన్నారు. "140 కోట్ల భారతీయుల సమష్టి సంకల్పంతో డిజిటల్ చెల్లింపుల్లో భారత్ గొప్ప పురోగతిని సాధించింది."పదేళ్ల కిందట, మన దేశాన్ని డిజిటల్ సాధికారత సాధించిన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన సమాజంగా మార్చడానికి డిజిటల్ ఇండియా కార్యక్రమం ప్రారంభమైంది.దశాబ్దం తర్వాత, ఎంతో మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన, నవయుగ సాధికారతకు నాంది పలికిన ప్రయాణానికి మనం సాక్షులుగా నిలిచాం. 140 కోట్ల భారతీయుల సమష్టి సంకల్పంతో డిజిటల్ చెల్లింపుల్లో భారత్ గొప్ప పురోగతిని సాధించింది. ఆరోగ్యం, విద్య లాంటి రంగాలు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందాయి.

ఈ మార్పులను, వాటి ప్రభావానికి సంబంధించిన వివరాలను ఈ పోస్టు మీకు అందిస్తుంది!"

# 42 సంవత్సరాల తరువాత భారత్‌లో ఐఏటీఏ వార్షిక సర్వసభ్య సమావేశం

న్యూఢిల్లీ, జులై 1:అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం (ఐఏటీఏ) 81వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని (ఏజీఎం) సోమవారం (జూన్ 2న) సాయంత్రం సుమారు 5 గంటలకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్నారు. ప్రపంచ శ్రేణి వైమానిక మౌలిక సదుపాయాల కల్పనను అభివృద్ధి చేయడంతో పాటు అనుసంధానాన్ని పెంచాలన్న తన నిబద్ధతకు అనుగుణంగా, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ ఏజీఎమ్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆహూతులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తారు.

ఐఏటీఏ 81వ ఏజీఎమ్‌తో పాటు ప్రపంచ వైమానిక రవాణా శిఖరాగ్ర సదస్సు (వరల్డ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సమిట్..డబ్ల్యుఏటీఎస్)ను జూన్ 1 నుంచి 3వ తేదీ మధ్య నిర్వహించనున్నారు. భారత్‌లో కడపటి ఏజీఎమ్‌ను 42 సంవత్సరాల కిందట– 1983లో– నిర్వహించారు. ఈ సమావేశం ప్రపంచ విమానయాన పరిశ్రమ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులతో పాటు అంతర్జాతీయ ప్రసార మాధ్యమాల ప్రతినిధులు సహా 1,600 మందికి పైగా ప్రతినిధులను ఈ ఏజీఎమ్ ఒక చోటుకు తీసుకు వచ్చింది.

విమానయాన పరిశ్రమ ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై ప్రపంచ వైమానిక రవాణా శిఖరాగ్ర సదస్సు దృష్టిని కేంద్రీకరించనుంది. ఈ సమస్యల్లో విమానసంస్థల పరిశ్రమకు చెందిన ఆర్థిక అంశాలు, ఆకాశ మార్గ సంధానం, ఇంధన భద్రత, విమానయాన పరిశ్రమకు అవసరమయ్యే ఇంధనాన్ని దీర్ఘకాల ప్రాతిపదికన ఉత్పత్తి చేసుకోవడం, కర్బన ఉద్గారాలను తగ్గించే దిశగా చేపట్టాల్సిన చర్యలకు అవసరమయ్యే ఆర్థిక వనరుల్ని సమకూర్చుకోవడం, నవకల్పనలు సహా ఇతర సమస్యలు చర్చకు రానున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి ఈ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనే విమానయాన రంగ ప్రముఖులు, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు విమానయాన రంగంలో భారత్ ఇప్పటి వరకు సాధించిన అసాధారణ మార్పుతో పాటు దేశ సామాజిక, ఆర్థిక ప్రగతికి ఈ రంగం అందించిన తోడ్పాటు గురించి కూడా అవగాహన చేసుకునే ఉంది.

# క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించండి .. ప్రభుత్వానికి జనసేన వినతి



హైదరాబాద్, జులై 1: పాశమైలారం సిగాచి కంపెనీ రియాక్టర్ పేలుడు ఘటన జరిగిన స్థలాన్ని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి నేమూరి శంకర్ గౌడ్ పరిశీలించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని ఏపి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరపున రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మరణించిన వారికి ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం కంపెనీ యాజమాన్యం ద్వారా ఇప్పిస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆయన స్వాగతించారు. నియోజకవర్గ ఇంచార్జి యడమ రాజేష్ మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ , ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ ఇలాంటి రసాయన పరిశ్రమలను నిరంతరం పర్యవేక్షిస్తూ చూడాలని చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దప్పు అరవింద్, వేణు, అఖిల్, శ్రీనివాస్, ఆదర్శ్, భాను, వికాస్, రోహిత్, శివ, సాకేత్, ప్రవీణ్ సాహు, హరి నాయక్ , శేరిలింగంపల్లి ఇంచార్జి మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ దాతృత్వం .. నటి పాకీజాకు రెండు లక్షల ఆర్థికసాయం



హైదరాబాద్, జులై 1: తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సినీ నటి వాసుకి (పాకీజా)కి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆప్త హస్తం అందించారు. ఆమె దీన స్థితి తెలిసి చలించిన పవన్ కళ్యాణ్ రూ. 2 లక్షల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. మంగళగిరి మధ్యాహ్నం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఈ మొత్తాన్ని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పి. హరిప్రసాద్ , పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాకీజాకు అందజేశారు.

కాగా, పవన్ కళ్యాణ్ చేసిన సాయానికి పాకీజా కృతజ్ఞతలు తెలిపారు. చిన్నవాడైనా ఎదురుగా ఉంటే కాళ్లు మొక్కుతానంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తన ఆర్థిక పరిస్థితి గురించి నిన్ననే పవన్ కళ్యాణ్ కార్యాలయానికి తెలియజేశాననీ, తక్షణం స్పందించి తగిన విధంగా ఆర్థిక సాయం అందించారని తెలిపారు. పవన్ కళ్యాణ్ కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

# నడిరోడ్డుపై కుక్కల స్వైర విహారం.. భయం భయంగా వాహనదారులు, చిన్నారులు

మెదక్, జులై 1:రోడ్డుపైనే కుక్కలు ప్రతీ రోజు స్వైర విహారం చేస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద కుక్కలు నడిరోడ్డుపై గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో అటువైపు వెళ్లే వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికే కుక్కల స్వైర విహారంతో పలువురికి రోడ్డు ప్రమాదాలు జరిగి కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది.ప్రతి రోజు ప్రధాన రోడ్లపై కుక్కలు గుంపులు గుంపులుగా ఉండడంతో చిన్నారులకు భయంగా ఉంది. కుక్కలు ఎప్పుడు కరుస్తాయో మోనని భయాందోళనకు గురవుతు న్నారు. రాయపోల్ మండల కేంద్రం లోని బస్టాండ్ వద్దనే ఈ పరిస్థితి ఉంటే గ్రామంలోని ప్రధాన వీధుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో తెలిసిపో తుంది. ఈ మధ్యకాలంలో మండల కేంద్రంలో కుక్కలు విపరీతంగా పెరగడంతో వీధుల వద్ద ఆడుకుం టున్న చిన్నారులపై కాటు వేసిన సంఘటనలు గతంలో కూడా చోటుచేసుకున్నాయి. రాయపోల్ మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డైన దౌల్తాబాద్, గజ్వేల్ రోడ్డుపై కుక్కలు రాత్రిపూట, ఉదయం పూట ఎప్పటికీ మందకు మంద ఉండడంతో వచ్చి పోయే వాహనాదారులకు ఎంతో ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీసుకొని చర్యలు తీసుకోవాలని స్థానికులు పేర్కొంటున్నారు.

# చేనేత కార్మికుల రిలే నిరాహార దీక్షలు విరమణ

భూదాన్ పోచంపల్లి, జూలై 01 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ముగిశాయి. చేనేత రుణమాఫీ, జియో ట్యాగ్ కలిగిన అర్హులైన చేనేత కార్మికులకు చేనేత సహకార సంఘం లో నూతనంగా సభ్యత్వాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు స్వీకరించాలని, అర్హులైన వారందరికీ కొత్తగా జియో ట్యాగ్ నంబర్లు ఇచ్చి ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేస్తూ చేనేత కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం దీక్షా శిబిరాన్ని జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరావు సందర్శించారు. ఈ విషయాన్ని రాష్ట్ర చేనేత, జౌళీ శాఖ మంత్రి, రాష్ట్ర చేనేత శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని, చేనేత రుణమాఫీ 15 రోజుల తర్వాత మాఫీ జరుగుతుందని హామీ ఇచ్చారు.

అనంతరం చేనేత నాయకులు కొంక లక్ష్మీనారాయణ, మిరియాల కృష్ణమూర్తి, బిర్రు ఉప్పలయ్యకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమిపజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ డీఓ రాజేశ్వర్ రెడ్డి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, రాష్ట్ర చేనేత జన సమాఖ్య అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, చేనేత నాయకులు భారత భూషణ్, బొమ్మ హరిశంకర్, మంగళపల్లి శ్రీహరి, కూరపాటి బాబు, ఏలె శ్రీనివాస్, వల్లందాస్ ప్రవీణ్, సీత కృష్ణ, జోగు శ్రీను, మిరియాల వెంకటేశం, కార్మికులు పాల్గొన్నారు.

# 5న గుట్టలో బీఆర్ఎస్ నియోజకవర్గ సన్నాహక సమావేశం : గొంగిడి మహేందర్ రెడ్డి



యాదగిరిగుట్ట, జూలై 01 : ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు యాదగిరిగుట్ట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, రాష్ట్ర నాయకులు సూదగాని హరి శంకర్ గౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో మీడియాకు ఆయన వివరాలు వెల్లడించారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన వ్యూహాలపై సమావేశంలో వారు పలు సూచనలు చేయనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఆలేరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పీఏసీఎస్ చైర్మన్లు, పాల సంఘం చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీలు, రైతు విభాగం కన్వీనర్లు, పార్టీ వివిధ విభాగాల నాయకులు, విద్యార్థి, యువజన, సోషల్ మీడియా నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గిరిప్రదక్షిణలో పాల్గొననున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక గిరి ప్రదక్షిణలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొననున్నట్లు గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. తెల్లవారుజామున 6.30 గంటలకు స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద స్వామివారి కొండ చుట్టూ పాదయాత్రగా ప్రదక్షిణ చేయనున్నారని, అనంతరం స్వామివారి గర్భాలయంలో నిర్వహించే అష్టోత్తర శతఘటాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, యువజన విభాగం నియోకవర్గ కన్వీనర్ గడ్డమీది రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య, గుండ్లపల్లి వెంకటేశ్ గౌడ్, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ సర్పంచ్ కసావు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రాజెక్టులకు వెంటనే నీటిని విడుదల చేయాలి : బొజ్జా దశరథరామిరెడ్డి

కర్నూలు జూలై 1 : తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువలకు నీటి విడుదల చేయకుండా తుంగభద్ర డ్యాం నుండి నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారని జూన్ 22నాటికే శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం 854అడుగులకు చేరినా రాయలసీమ ప్రాజెక్టులకు నీటి విడుదల చేయని ప్రభుత్వం తీరుపై రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తపరిచారు.

మంగళవారం నంద్యాల సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా రావలసిన రుతుపవనాల కంటే సుమారు 15 రోజులు ముందుగా రాయలసీమలో రుతుపవనాలు ప్రవేశించడంతో గత మే నెలలో వర్షాలు రాయలసీమలో విస్తారంగా కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించి కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్ బీసీ, ఎల్ఎల్సి ఆయకట్టు కింద లక్ష ఎకరాలకు పైగా పొలాల్లో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, మినుము, కంది, వేరుశనగ తదితర ఆరుతడి పంటల ను రైతులు సాగు చేశారన్నారు.

శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం 869.73 అడుగులు చేరినా రాయలసీమ ప్రాజెక్టులకు నీటి విడుదలకు ముందుకు రాని ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి పేరుతో రిజర్వాయర్ నుంచి దిగువకు నీటి విడుదల చేయడం పట్ల రాయలసీమ పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని ఘాటుగా విమర్శించారు.

# సిగాచీ బ్లాస్ట్‌లో నవదంపతులు దుర్మరణం .. కన్నీటి సంద్రంలో ఎమ్మెల్యే కొలికపూడి



హైదరాబాద్, జులై 1:ప్రేమించుకున్నారు.. కలిసి నడుద్దాం అనుకున్నారు.. ప్రేమ పెళ్లి చేసుకున్నారు.. ఇద్దరూ కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభించారు.. నీకు నేను.. నాకు నువ్వు అనుకున్నారు.. ఈ ఇద్దరి ప్రేమకు ఆ రెండు కుటుంబాలు కూడా ఒప్పుకున్నాయి.. ఇద్దరూ ఒకే దగ్గర ఉద్యోగంలో చేరారు.. అయితే, వారి ప్రేమను మృత్యువు కూడా విడదీయలేదు.. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో జరిగిన పేలుడు ఘటన చాలా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపగా.. మృతదేహాలకు పఠాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం చేశారు వైద్యులు.. అయితే, ఈ పేలుడులో ఏపీకి చెందిన నవదంపతులు మృత్యువాత పడ్డారు. కడప జిల్లాకు చెందిన నిఖిల్ కుమార్ రెడ్డి , రమ్యశ్రీ దుర్మరణం పాలయ్యారు.. సిగాచి పరిశ్రమ ల్యాబ్‌లో పనిచేస్తున్న నిఖిల్ కుమార్ రెడ్డి, రమ్యశ్రీ.. రెండు నెలల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్నారు.. వివాహం అనంతరం ఇటీవలే విధుల్లో చేరారు ఈ నవదంపతులు.. నిన్న జరిగిన పేలుడులో ఇద్దరూ ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.. పోస్టుమార్టం చేసిన తర్వాత ఇద్దరి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు పోలీసులు. నిఖిల్ రెడ్డి మృతదేహాన్ని కడప జిల్లాకు తరలించడగా.. రమ్యశ్రీ డెడ్ బాడీని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు తరలించారు కుటుంబ సభ్యులు..

ఈ ఘటనపై టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు భావోద్వేగానికి గురయ్యారు.. ఆ నవదంపతులతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. కన్నీళ్లు ఆగడం లేదని ఆయన పేర్కొన్నారు.. ప్రారంభంలోనే ముగిసిన ప్రయాణం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.. కడవ జిల్లా జమ్మలమడుగు సమీపంలో ఒక చిన్న గ్రామానికి చెందిన రైతు బిడ్డ నిఖిల్ రెడ్డి ఎమ్మెస్సీ చదువుకొని పఠాన్‌చెరువు సమీపంలో ఒక ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట మండలంలో పుట్రెల గ్రామ ంలో సౌత్ మాలపల్లిలో ఒక రైతు కూలీ కుటుంబంలో పుట్టిన రామాల శ్రీ రమ్య.. తిరుపతి పద్మావతి మహిళ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదివింది. నిఖిల్ రెడ్డి పనిచేస్తున్న ఫార్మా కంపెనీలోనే ఉద్యోగం సంపాదించుకుంది. పిల్లలు ఇద్దరు అత్యంత సాధారణ కుటుంబాల నుంచి కష్టపడి చదువుకొని స్వయంకృషితో ఉద్యోగాలు సంపాదించు కున్నారు. మంచి స్నేహితులుగా మారిన వాళ్ళు పరస్పరం ఇష్టపడి వివాహం చేసుకోవాలని నిర్ణయానికి వచ్చిన తర్వాత వారి కుటుంబాలకు తెలియజేశారు. వారి ప్రేమ వివాహానికి చిన్న చిన్న అవరోధాలు ఏర్పడ్డాయి. కొన్ని నెలలపాటు తీవ్ర మనోవేదన అనుభవించిన ఆ యువ జంట సహాయం కోసం నాతో మాట్లాడారని గుర్తుచేసుకున్నారు..

నేను మొదట నిఖిల్ రెడ్డి అమ్మగారితో మాట్లాడాను ఆమె చాలా స్పష్టంగా ఒక మాట చెప్పారు నాకు ఇద్దరు మగ పిల్లలు ఇప్పుడు నా పెద్ద కొడుకు నిఖిల్ ఇష్టపడి రమ్యని కోడలుగా మా ఇంటికి తీసుకు వస్తే ఆ పాపని మా సొంత కూతురు లాగా చూసుకుంటాం అన్నారని ఎమ్మెల్యే శ్రీనివాసరావు పేర్కొన్నారు.. వాళ్ల పెళ్లికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. అని ఆ తల్లి చెప్పింది. ఆమె మాటలు విన్న తర్వాత.. రమ్య కుటుంబ సభ్యులకు నేనే ధైర్యం చెప్పి, రెండు కుటుంబాల మధ్య సంప్రదింపులు మొదలుపెట్టాం.. రెండు కుటుంబాలు కలుసుకున్నాయి.. రెండు కుటుంబాల పెద్దలు చాలా ఆత్మీయంగా మాట్లాడుకుని, ఆషాడ మాసం తర్వాత మంచి ముహూర్తం చూసి పిల్లలకు పెళ్లి చేద్దామని నిర్ణయానికి వచ్చారని తెలిపారు.. అయితే, ఇది జరిగిన తర్వాత.. పిల్లలిద్దరిని హైదరాబాద్‌లో మా ఇంటికి పిలిచి.. ధైర్యం చెప్పి.. బట్టలు పెట్టి పంపించడం జరిగింది.. అంటూ దానికి సంబంధించిన ఫొటోను కూడా షేర్ చేశారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.. నాలుగు రోజుల క్రితం రమ్య కుటుంబ సభ్యుల నుండి త్వరలో నిశ్చితార్థం పెట్టుకుం టాము.. మీరు తప్పనిసరిగా రావా లి. అని ఆహ్వానం అందింది. నేను కూడా వస్తాను అని చెప్పినట్టు పేర్కొన్నారు..

అయితే, నిన్న తిరువూరు నియోజకవర్గంలో వరుస కార్యక్రమాలతో బిజీగా ఉన్న నాకు ఫార్మా కంపెనీలో పేలుడు గురించి, భారీ ప్రాణ నష్టం గురించి తెలియగానే.. ఈ పిల్లలు పనిచేస్తున్న కంపెనీ పేరు తెలుసుకోవటానికి ముందుగా నేను నిఖిల్ రెడ్డికి ఫోన్ చేశాను.. ఆ తర్వాత రమ్య కి ఫోన్ చేశాను.. ఇద్దరి నుంచి స్పందనలేకపోవడంతో.. రమ్య అక్కకు ఫోన్ చేశాను రెస్పాన్స్ లేదు.. తర్వాత టీవీ ఛానల్స్‌లో పేలుడు.. మృతుల్లో ఏపీకి చెందిన వారు ఉన్నట్లు చూశానని.. తర్వాత హైదరాబాద్ బయల్దేరి సాయంత్రం 6 గంటల వరకు ఫార్మా కంపెనీకి చేరుకున్నాను.. రమ్య అక్క జ్యోత్స్న ఆమె స్నేహితులు మరో ముగ్గురు తీవ్ర విషాదంలో అక్కడే ఉన్నారని భావోద్వేగానికి గురయ్యారు.. అక్కడున్న కలెక్టర్ తో, పోలీస్ అధికారులతో మాట్లాడినప్పటికీ ఎవరు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు.

గుర్తుపట్ట లేనంతగా కాలిపోయిన అనేక మృతదేహాలను.. గాయపడ్డ వారిని సమీపంలో ఉన్న మూడు నాలుగు ఆసుపత్రులకు తరలించారు.

ఉదయం నుంచి వర్షంలోనే తడుస్తూ.. కంపెనీ దగ్గరే ఉన్న రమ్య అక్కను.. ఆమె స్నేహితులను వాళ్ళ ఇంటిదగ్గర డ్రాప్ చేసి, నేను రాత్రి 9 తర్వాత మా ఇంటికి చేరుకున్నాను. ఉదయాన్నే బయలుదేరి మళ్లీ కంపెనీ దగ్గరికి వెళ్లాలని రాత్రి అనుకున్నాము. అయితే తెల్లవారే సమయానికి నిఖిల్ రెడ్డి పాత రూమ్ మెట్ ఫోన్ చేసి.. వాళ్లిద్దరూ మనకు లేరు సార్ అని చెప్పాడు. మరి కాసేపటికి .. ఇద్దరి మృతదేహాలను గుర్తించినట్టు.. ఆసుపత్రి నుండి రమ్య అక్కకు సమాచారం అందింది.

ఈ మహా విషాదాన్ని తట్టుకోవడం రెండు కుటుంబాలకు చాలా చాలా కష్టం. ఆ తల్లిదండ్రులు తట్టుకోలేని చేదు నిజం మిగిలింది. ఏం చెప్పాలో మాటలు రావడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు ఎమ్మెల్యే శ్రీనివాసరావు..

ఇక, మా నాన్న 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కోసం పనిచేశాడు మా నాన్నకు ఏదైనా సహాయం చేయండి సార్ అని.. మొన్న రమ్య మా ఇంటికి వచ్చినప్పుడు అడిగింది. గత సంవత్సర కాలంలో ఆమె తల్లిదండ్రులు రెండుసార్లు నన్ను కలిశారు. మరి కొద్ది రోజుల్లో జరగబోయే పెళ్లి సందర్భంగా వాళ్ళింటికి వస్తానని చెప్పాను. ఇంతలోనే ఒక కన్నీటి ఉప్పెన. ఆ పిల్లల స్వప్నాలను తుడిపేసింది. ఆ తల్లిదండ్రుల గుండెలకు చికిత్స లేని గాయం చేసింది.

ఎంత కంట్రోల్ చేసుకున్నా ఆగని కన్నీళ్లతో మీ కొలికపూడి శ్రీనివాసరావు అంటూ బరువెక్కిన గుండెతో ఓ ప్రకటన విడుదల చేశారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.. కాగా, నిఖిల్ కుమార్ రెడ్డి, రమ్యశ్రీ.. ఆర్య సమాజ్‌లో ప్రేమ పెళ్లి చేసుకున్నా.. ఆ రెండు కుటుం బాలు మరోసారి వారికి గ్రాండ్‌గో వివాహం చేయాలని అనుకోగా.. ఇం తలోనే.. ఊహించని ఘటన.. ఆ కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది..

# అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తాం : మంత్రి టీజీ భరత్



కర్నూలు,జులై 1: కర్నూలు నగరంలో అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. మంగళవారం ఉదయం స్టేట్ గెస్ట్ హౌస్ లో మంత్రి టి.జి భరత్.. జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు తహసీల్దార్ వెంకట రమేష్, అర్బన్ తహసీల్దార్ రవి, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులుతో సమీక్ష సమావేశంనిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో మంత్రి నారా లోకేష్ ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన విధంగా కర్నూల్లో కూడా పంపిణీ చేసేందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. నగరంలోని పంప్ హౌస్ సమీపంలో ఉన్న గూడెం కొట్టాల ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు వారికి పట్టాలు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

దీంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి వారి పేరు మీద పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గతంలో ఇళ్ల పట్టాలిచ్చిన వారికి స్థలాలు లేవని చాలా మంది తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ వివరాలు తీసుకొని పట్టాలు ఉన్నప్పటికీ స్థలాలు లేని వారికి స్థలాలు చూపించాలని చెప్పారు. అలాగే బుధవారపేట ప్రాంతంలో నివాసితుల వివరాలు తీసుకొని పట్టాలు ఇవ్వాలని అధికారులకు చెప్పారు. 2014కు ముందు ఈ.తాండ్రపాడులో పట్టాలిచ్చిన ప్రాంతంలో స్థలాలు గుర్తించలేని పరిస్థితి నెలకొందని..ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి టి.జి.భరత్ అన్నారు.

వెంకటరమణ కాలనీ మున్సిపల్ వాటర్ వర్క్స్ ఎదురుగా ఉన్న నాలుగున్నర ఎకరాల డాటెడ్ ల్యాండ్ పోలీసు వారి దగ్గర నుండి కర్నూలు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల నిమిత్తం తీసుకోవటానికి కావలసిన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఏ, బీ, సీ క్యాంప్ ల ప్రభుత్వ గృహ సముదాయాల్లో శిథిలావస్థకు చేరిన గృహాలను పూర్తిగా తొలగించి చదును చేయాలని, ఆ స్థలాలను ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవడానికి అనుకూలంగా మార్చాలని ఆదేశించారు.

# విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి: ఎస్ఈ చంద్రశేఖర్



హైదరాబాద్, జులై 1:విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తలు విధిగా తీసుకొని ముందుకు సాగాలని సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ఇబ్రహీంబాద్ విద్యుత్ డివిజన్ పరిధిలోని నిక్నాపూర్‌లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ భద్రత వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లైన్ క్లియర్ పొందిన తర్వాతనే పని చేయాలన్నారు. హెల్మెట్, సేఫ్టీ బెల్ట్ పెట్టుకుని పని చేయాలని సూచించారు. ప్రాణాలు కాపాడటంలో ఎర్తింగ్ అతి ముఖ్యమైనది. కనుక పని ప్రారంభించే ముందు ఎర్తింగ్ తప్పకుండా వాడాలన్నారు.

పనిలో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ వాడకూడదని, మత్తు పదార్థములు సేవించొద్దన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు, ఉద్యోగులు జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మోకిలా అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ మేడి రమేష్, ఇబ్రహీం బాగ్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ అంబేద్కర్, చేవెళ్ల అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ రాజేష్, అసిస్టెంట్ ఇంజినీర్లు హాము నాయక్, ప్రదీప్, శివరామకృష్ణ, కోటేశ్వరరావు, ప్రవీణ్, మణికంత, సంతోష్, లైన్ ఇన్స్పెక్టర్లు రత్నం, కేడీఎల్ నారాయణ, సురేష్, మురళి, సునీల్, అశోక్, బిక్షపతి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు గొప్ప బలం - శ్రీ చౌహాన్



న్యూఢిల్లీ, జులై 1:కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు న్యూఢిల్లీలోని ఎన్‌డిఎంసి కన్వెన్షన్ సెంటర్‌లో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీ 'సమగ్ర మానవతావాదం' తత్వశాస్త్రం యొక్క 60వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ స్మారక సింపోజియంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా, కేంద్ర మంత్రి 'సమగ్ర మానవతావాదం' అంటే ఏమిటో వివరించారు మరియు ప్రస్తుత సందర్భంలో దాని ఔచిత్యాన్ని హైలైట్ చేశారు.

ఈ సింపోజియంలో ప్రసంగిస్తూ, శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, "నేను గౌరవనీయులైన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జీ పాదాలకు నమస్కరిస్తున్నాను.

నేను పూర్తి నమ్మకంతో ఇలా చెబుతున్నాను: నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు 'సమగ్ర మానవతావాదం' తత్వశాస్త్రంలో ఉన్నాయి. ఇది సంక్లిష్టమైన తత్వశాస్త్రం కాదు; బదులుగా, ఇది భారతీయ ఆలోచన యొక్క సారాంశం."

గతంలో ప్రపంచంలో రాచరికాలు ఉండేవని, కానీ తరువాత ప్రజలు ఒకే వ్యక్తి ఎందుకు పరిపాలించాలని ప్రశ్నించారని శ్రీ చౌహాన్ అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం మరియు సోదరభావం అనే ఆదర్శాల కింద రాచరికాలు రద్దు చేయబడ్డాయి లేదా వాటి అధికారాలు గణనీయంగా తగ్గించబడ్డాయి. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీ పశ్చిమ దేశాలను గుడ్డిగా అనుకరించవద్దని అన్నారు. సమాజాన్ని మరియు రాష్ట్రాన్ని నిర్మించడానికి భారతదేశానికి దాని స్వంత తత్వశాస్త్రం ఉందా అని ఆయన అడిగారు. అప్పుడే పండిట్ దీన్‌దయాళ్ జీ 'సమగ్ర మానవ తావాదం'ను ప్రస్తుతించారు.

వ్యవసాయం సందర్భంలో మాట్లాడుతూ, శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ భారత ఆర్థిక వ్యవస్థకు ఏదైనా గొప్ప బలం ఉంటే అది వ్యవసాయమేనని అన్నారు. "నేను వ్యవసాయ మంత్రిని మాత్రమే కాదు; నేను 'వ్యవసాయం' అనే పదాన్ని జీవిస్తున్నాను. వ్యవసాయం మరియు రైతులు నా సిరల్లో నడుస్తారు."

మానవతావాదం యొక్క వివిధ రూపాలను ప్రతిబింబిస్తూ, శ్రీ చౌహాన్ ఇలా అన్నారు, "న్యూటన్ గురుత్వాకర్షణ శక్తిని కనుగొన్నాడు, వస్తువులు నేలపై పడటానికి కారణం. ఈ ఆవిష్కరణ నుండి అతను అనుభవించిన ఆనందాన్ని తెలివి యొక్క ఆనందం అంటారు."జీవితంలో సంపద యొక్క ప్రాముఖ్యతను వెలుగులోకి తెస్తూ, పండిట్ దీన్‌దయాళ్ జీ భౌతిక వనరుల అవసరాన్ని కూడా నొక్కిచెప్పారని శ్రీ చౌహాన్ అన్నారు. జీవించడానికి మరియు ఆహారం, దుస్తులు మరియు ఆశ్రయం వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడానికి డబ్బు ముఖ్యం. కానీ సంపద అనేది అతిగా లేకపోవడం లేదా అధికంగా ఆధిపత్యం వహించకూడదు.

# హోంమంత్రి అనిత భోజనంలో బొద్దింక..

**-బీసీ హాస్టల్లో విద్యార్థులతో కలసి లంచ్ చేస్తుండగా ఘటన**

**-వార్డెన్, వంట మనుషులపై ఆగ్రహం**

**-రోజూ విద్యార్థులకు ఇలాగే పెడుతున్నారా అంటూ మండిపాటు**

**-సస్పెండ్ చేస్తానంటూ వార్నింగ్**

అమరావతి, జులై 1: హాస్టల్‌లో వసతులు తెలుసుకుని, అక్కడి పరిస్థితులు, భోజనం పరిశీలించడానికి వెళ్లిన ఏపీ హోంమంత్రి అనితకు చేదు అనుభవం ఎదురైంది. రాష్ట్రంలోని ఒక బీసీ బాలికల హాస్టల్‌ను సందర్శించిన ఆమె అక్కడి విద్యార్థినులతో కలిసి భోజనం చేయాలనుకున్నారు. ఈ క్రమంలో హోంమంత్రి నేటి ఉదయం విద్యార్థుల తో కలిసి భోజనం చేస్తుండగా ఆమె ప్లేట్‌లోనే బొద్దింక వచ్చింది. ఆ ఘటనను చూసి అవక్కాయిన హోంమంత్రి అక్కడి వంట మనుషు లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

తన పర్యటనలోనే ఇలా చేదు అనుభవం ఎదురవ్వడం, తనకు పెట్టిన భోజనంలోనే బొద్దింక రావడాన్ని ఆమె సీరియస్ గా తీసుకున్నారు. వంట సిబ్బందికి ఆ బొద్దింకను చూపించి, పిల్లలకు రోజు ఇలాంటి భోజనమే పెడుతున్నారా అంటూ మండిపడ్డారు. ఇక స్కూళ్లలో సన్నబియ్యంతోనే భోజనం పెట్టాలని ప్రభుత్వం ఆదేశించినా ఇప్పటి వరకు గ్రౌండ్ లెవల్‌లో అది జరగకపోవడాన్ని ఆమె తీవ్రంగా పరిగణించారు.

# ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో 'విక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్'

న్యూఢిల్లీ, జులై 1: 'విక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్'లో నాల్గవ రోజు కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో రైతులతో సంభాషించారు. మీరట్‌లోని దబ్తువా గ్రామంలో, కేంద్ర వ్యవసాయ మంత్రి రైతులతో మాట్లాడారు, తరువాత జంగేతి గ్రామంలోని ఒక మంచంపై అనధికారిక సంభాషణ జరిగింది.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన శ్రీ చౌహాన్, వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి రైతులతో ప్రత్యక్ష సంభాషణలో పాల్గొనడానికి ఒక బృందంగా ఈ పర్యటన చేపట్టానని పేర్కొన్నారు. గ్రామ సమావేశాలలో (చౌపల్స్) సంభాషణలు నిర్వహించడం యొక్క లక్ష్యం అధునాతన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం.ఉత్పత్తిని పెంచడానికి, ఖర్చులను తగ్గించడానికి, ఉత్పత్తులకు న్యాయమైన ధరలను నిర్ధారించడానికి మరియు నష్టాలను నివారించడానికి ప్రయత్నాలను ముమ్మరం చేయవలసిన అవసరాన్ని మంత్రి హైలైట్ చేశారు. ఇవి 'విక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్' యొక్క ప్రధాన లక్ష్యాలు అని ఆయన అన్నారు.



# "నేను సైతం" అనే భావనతో కలెక్టివ్ లీడర్‌షిప్‌లో నన్ను ఆదరించాలి

## -భారతీయ జనతా పార్టీకి తెలంగాణలో మంచి భవిష్యత్తు ఉంది
## -పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తా
## -దమ్ముంటే నన్ను ఎదిరించి పోరాడండి
## -పేరులేని పేపర్లతో సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం చేస్తే వారిపై క్రిమినల్ కేసులు
## -భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడు ఎన్.రాంచందర్



హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడుగా ఎన్.రాంచందర్ నియమితులైనారు. ఈజరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ మీరు "నేను సైతం" అనే భావనతో కలెక్టివ్ లీడర్‌షిప్‌లో నన్ను ఆదరించాలి. నా నిర్ణయాలు వ్యక్తిగతంగా ఉండవు. అందరి నిర్ణయాలు తీసుకుని నేను అమలు చేయబోతున్నాను. భారతీయ జనతా పార్టీకి తెలంగాణలో మంచి భవిష్యత్తు ఉంది. కొందరు సోషల్ మీడియాలో బిజెపి పై, నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దమ్ముంటే నన్ను ఎదిరించి పోరాడండి. పేరులేని పేపర్లతో సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం చేస్తే వారిపై క్రిమినల్ కేసులు వేసి జైలుకు పంపిస్తాం. లీగల్ యాక్షన్ టుంది. మనమంతా క్రమశిక్షణతో బిజెపిని ముందుకు తీసుకెళ్లాలి. బిజెపి సిద్ధాంతాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలి. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగించాలి. జాతీయ, రాష్ట్ర నేతల మార్గదర్శనంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తాను. కానీ రాంచందర్ రావు అనే వ్యక్తి సౌమ్యుడు కాదు. 14 సార్లు జైలుకు వెళ్లినవాడిని. సిద్ధాంతం కోసం పోరాడినవాడిని. విద్యార్థుల కోసం లాఠీచార్జ్ లు ఎదుర్కొన్నాను. పోలీసులు చేసిన లాఠీచార్జ్ లో నా చేయి విరిగింది. సిద్ధాంతం కోసం, కార్యకర్తల కోసం త్యాగం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అగ్రెసివ్ అంటే సిద్ధాంతంపై నమ్మకంతో ముందుకు వెళ్లడం. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తాం. నేను విద్యార్థి దశ నుంచే అనేక పోరాటాలు చేశాను. అడ్వకేట్ల కోసం, విద్యార్థుల కోసం పోరాడాను. ఇప్పుడు తెలంగాణ ప్రజల కోసం పోరాడతాను. జనసంఘ్ నుంచి భారతీయ జనతా పార్టీ వరకు... అనేక దశల్లో కార్యకర్తల త్యాగాలు, నిరంతర శ్రమ ఫలితంగా బిజెపి దేశంలో అతిపెద్ద, బలమైన పార్టీగా ఎదిగింది. క్రమశిక్షణ, సిద్ధాంతం పట్ల నిబద్ధతతో ఈ స్థాయికి వచ్చాం. ఇప్పుడు మనందరి లక్ష్యం ? బిజెపిని తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడం. ఈ సందర్భంగా ఒక సంఘటన గుర్తు చేసుకోవాలి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలులో బిజెపి ఏర్పడే ముందు, జనసంఘ్ తరఫున ఓ అభ్యర్థి పోటీ చేశారు. ఆయనకు దాదాపు వెయ్యి ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికలో కమ్యూనిస్టు పార్టీ గెలిచింది. అయినప్పటికీ, జనసంఘ్ అభ్యర్థి తరఫున కార్యకర్తలు పార్టీ కార్యాలయం ముందు బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. అప్పట్లో జనసంఘ్ నాయకులని ఆ సంబరాలపై ప్రశ్నించగా "గత ఎన్నికల్లో 300 ఓట్లు వచ్చాయి, ఈసారి వెయ్యి వచ్చాయి. పార్టీ ఎదుగుతోంది. బలోపేతమవుతోంది. అందుకే ఈ ఆనందం అని సమాధానమిచ్చారు. అలాంటి స్థితి నుంచి ఈరోజు బిజెపి తెలంగాణలో 8 మంది లోక్‌సభ సభ్యులు, 8 మంది ఎమ్మెల్యేలు, ఒక రాజ్యసభ సభ్యుడు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్న స్థాయికి ఎదగడం గర్వకారణం. అప్పట్లో బిజెపి అంటే చాలామందికి తెలియని పరిస్థితి. నేను యువమోర్చా కార్యకర్తగా ఉన్నప్పుడు నల్గొండ జిల్లాలో సభ్యత్వ నమోదు కోసం సైకిల్‌పై డబుల్స్ జర్నీ చేసి పార్టీ కోసం పనిచేశాను. విద్యార్థి పరిషత్‌లో ఉన్నప్పుడు హైదరాబాద్ నుంచి బస్సుల్లో కరీంనగర్, మెట్‌పల్లికి వెళ్లి సభ్యత్వ సేకరణ కోసం ప్రయాణించేవాళ్లం. ఈరోజు బిజెపి ఈ స్థాయికి వచ్చిందంటే, దానికి కార్యకర్తల త్యాగాలు, నాయకుల కృషి, శ్రమ కారణం. డీఎస్పీ రెడ్డి గారు, చలపతి రావు గారు, వి. రామారావు గారు, బండారు దత్తాత్రేయ గారు, విద్యాసాగర్ రావు గారు, డాక్టర్ కె. లక్ష్మణ్ గారు, కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశారు. బిజెపి పార్టీ ఎదుగుదలలో ఇంతమంది రాష్ట్ర అధ్యక్షుల, నాయకుల కృషి, శ్రమ ఉంది. గత 11 సంవత్సరాలుగా నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పరిపాలిస్తోంది. ఆయనతోపాటు అమిత్ షా గారు, జేపీ నడ్డా గారు, బీఎల్ సంతోష్ గారి ఆశీర్వాదం కూడా మనకు లభిస్తోంది. తీయ నాయకులతో పాటు, రాష్ట్రస్థాయిలో కిషన్ రెడ్డి గారు, డా. కె. లక్ష్మణ్ గారు, బండి సంజయ్ గారు వంటి నేతల సహకారంతో నాకు ఈ బాధ్యత లభించింది. 14 కోట్ల సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన బిజెపిలో తెలంగాణ రాష్ట్ర శాఖకు నేను అధ్యక్షుడిగా ఎన్నికవడాన్ని నేను గర్వంగా భావిస్తున్నాను. అయినప్పటికీ, నేను నా మనసులో పార్టీ కార్యకర్తగానే పనిచేస్తాను. బిజెపిలో కలెక్టివ్ లీడర్‌షిప్ ఉంటుంది. గతంలో నల్లగొండ జిల్లాలో మైసయ్య గౌడ్ అనే కార్యకర్తను నక్సలైట్లు హత్య చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కృష్ణవర్ధన్ రెడ్డి గారు, చంద్రారెడ్డి గారు నక్సలైట్ల బుల్లెట్లకు బలయ్యారు. నేటి బిజెపి నాయకులు మనోహర్ రెడ్డి గారు, కాసం వెంకటేశ్వర్లు గారు, దుగ్యాల ప్రదీప్ కుమార్ గారు, ధర్మారావు గారు, నేనూ అందరం కలిసి నక్సలైట్లతో పోరాడి ఏబీవీపీని గెలిపించుకున్నాం. ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీని గొప్ప స్థాయిలో నిలబెట్టడం జరిగింది. బిజెపి అనేది క్యాడర్ బేస్డ్ పార్టీ, మాస్ బేస్డ్ పార్టీ, ఐడియాలజికల్ బేస్డ్ పార్టీ. తెలంగాణలో గోల్కొండ ఖిల్లాపై బిజెపి జెండా ఎగురవేయాలంటే ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి. బిజెపిలో కొత్త, పాత అనే తేడా ఉండదు. మన ఇంట్లో బాబు పుట్టినా, పాప పుట్టినా పుట్టినరోజునుంచే వారు కుటుంబసభ్యులవుతారు. అదే బిజెపిలోనూ వర్తిస్తుంది. నది ప్రవహించాలి. కొత్తనీరు రావాలి. కొత్తవాళ్లు, పాతవాళ్లు కలిసి బిజెపిని బలోపేతం చేయాలి. తెలంగాణ యువత రాజకీయాల్లోకి రావాలి. యువతలో ఉన్న చైతన్యాన్ని బిజెపి లోకి తేవాలి. యువకులు, మహిళలు బిజెపి లో చేరాలి. భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలి. రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకురావాలి. బిజెపి వైపు రాష్ట్ర ప్రజలు చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. పంచాయత్ నుంచి పార్లమెంట్ వరకూ బిజెపి గెలవాలి. బీఆర్ఎస్ పార్టీ వాట్సాప్ యూనివర్సిటీతో, కాంగ్రెస్ పార్టీ ఫేక్ న్యూస్ యూనివర్సిటీతో ట్రోలింగ్ చేస్తోంది. ట్రోలింగ్ చేసేవారు చేసుకుంటారు.

# నిర్దేశిత పనివేళలు ముగిసిన తర్వాత అదనంగా పని చేయొద్దు

## -ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఉద్యోగులకు ఇన్ఫోసిస్ ఈమెయిల్స్ ద్వారాసందేశం

న్యూ ఢిల్లీ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); దేశం పురోగతి సాధించాలంటే యువత 70 గంటలు పనిచేయాల్సిందేనని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో పని గంటలపై ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు తాజాగా కీలక సూచన చేసింది. నిర్దేశిత పనివేళలు ముగిసిన తర్వాత అదనంగా పని చేయొద్దని ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఉద్యోగులకు ఈమెయిల్స్ ద్వారా సూచిస్తోంది. ఉద్యోగులు అదనపు పని గంటలు, ఒత్తిడి, నిద్రలేమి కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నట్లు సంస్థ గుర్తించింది. ఈ మేరకు ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ కీలక సూచన చేసింది. ఇన్ఫోసిస్ ప్రస్తుతం హైబ్రిడ్ పద్ధతిని అవలంభిస్తోంది. దీని ప్రకారం ఇన్ఫీ ఉద్యోగులు నెలకు పది రోజులు ఆఫీసుకు రావాల్సి ఉంటుంది. ఉద్యోగులు వారంలో ఐదు రోజులు.. రోజుకు సగటున 9:15 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువ సమయం పనిచేస్తున్న వారిని హెచ్ఆర్ విభాగం గుర్తించి వారికి వ్యక్తిగతంగా ఈమెయిల్స్ పంపుతోంది. ముఖ్యంగా రిమోట్‌గా పనిచేస్తున్న వారికి ఏ రోజు ఎన్ని గంటలు పనిచేసిందీ ఈమెయిల్‌లో పేర్కొంటోంది. పనివేళలు ముగిసిన వెంటనే విశ్రాంతి తీసుకోవాలని, పని మధ్యలో విరామం తప్పనిసరి అని ఆ మెయిల్స్‌లో సూచిస్తోంది. పని గంటల తర్వాత ఆఫీస్ పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేస్తోంది. నారాయణమూర్తి వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ ఉద్యోగుల వ్యక్తిగత ఆరోగ్యం, వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై ఇన్ఫీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం-జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్, జులై 1:(నేటినిజం ప్రతినిధి): ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం కురవి మండలం బలపాల గ్రామంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్ పామ్ ప్లాంటేషన్ మెగా మేళాలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ముఖ్య అతిదిగా పాల్గొని ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న మాట్లాడుతూ బోర్ల క్రింద ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలు, మల్బరీ, పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేయాలని మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలని, ఆయిల్ పామ్ సాగు ఒక ఎకరానికి పామాయిల్ పది టన్నులు దిగుబడి లక్షకు పైగా ఆదాయం నెలనెలా స్థిరమైన ఆదాయం ఆయిల్ పామ్ తోనే సాధ్యం అని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 8000 ఎకరాల పైగా పామాయిల్ సాగు అవుతుందని, 1350 ఎకరాలలో పామాయిల్ గెలలు దిగుబడి మొదలై ప్రతి రైతు ఎకరానికి లక్ష రూపాయల ఆదాయం పొందుతున్నాం న్నారు. ఈ సంవత్సరానికి గాను 4500 ఎకరాల లక్ష్యంతో ఇప్పటి వరకు 663 ఎకరాలలో మొక్కలు నాటడానికి రైతులు అనుమతి పొందినారన్నారు.

ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి అవసరాల నిమిత్తం అన్ని రకాల కూరగాయలను సాగు చేసుకోవాలని, కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, మల్చింగ్, బిందు సేద్యం మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బజ్జూరి పిచ్చి రెడ్డి, బజ్జూరి ఉమా,రమేష్, హనుమంత రావు, చంద్రారెడ్డి, , సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ. శ్రీనివాస్, వ్యవసాయ అధికారి జి. నరసింహ రావు, ఉద్యాన అధికారి ఆర్. శాంతి ప్రియ, వ్యవసాయ విస్తరణ అధికారి లయ, టి.జి. ఆయిల్ ఫెడ్ క్షేత్ర సిబ్బంది నాగరాజు, జి. చంద్ర ప్రకాష్, కార్యాలయ సూపరింటెండెంట్ ఆర్. శ్రీనివాస రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి హరి మరియు బిందు సేద్య ప్రతినిది ఆగస్టిన్, కె. శంకర్ పాల్గొన్నారు.

# పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలి

## -ప్రజలకు అందుబాటులో ఉండటమనేది చాలా ముఖ్యం
## -పార్టీ శ్రేణులకు వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి పిలుపు

అమరావతి జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలి అని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిలదీయడంలో యువతది కీలక పాత్ర అని అన్నారు. తాడేపల్లి పార్టీ యువజన విభాగం నేతలతో జగన్ భేటీ అయ్యారు. పార్టీలో యూత్ వింగ్ క్రియాశీలకం అని.. లీడర్లుగా ఎదిగేందుకు ఇప్పుడు గొప్ప అవకాశమని, పార్టీ ప్రారంభించిన కొత్తలో అందరూ కొత్తవాళ్ళే అని తెలియజేశారు. పార్టీ పెట్టిన కొత్తలో తాను, తన అమ్మ మాత్రమే ఉన్నాం అని, తన మీద వ్యక్తిగతంగా అభిమానం ఉన్నవాళ్లు తనతో వచ్చారు అని అన్నారు. తన ప్రస్థానం అక్కడ నుంచి మొదలయ్యింది అని ఎన్ని కష్టాలు వచ్చినా, విలువలు, విశ్వసనీయతకు పెద్దపీట వేశామని పేర్కొన్నారు. రాజకీయంగా ఇబ్బందులు వచ్చినా రాజీపడలేదని, ఉప ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజార్టీ తమకు వచ్చిందని చెప్పారు. "పార్లమెంట్ లో ప్రతి సభ్యుడూ మన వైపే చూసే పరిస్థితి అని దాన్ని జీర్ణించుకోలేక మన మీద పగబట్టారు" అని ఆవేదనను వ్యక్తం చేశారు. 18 మంది ఎమ్మెల్యేలు పార్టీలోకి వస్తే రాజీనామా చేయించానని, ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించాం అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఉపఎన్నికల్లో టిడిపి, కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయని, 2014లో 67 మందితో గెలిచాం అని అన్నారు. మళ్లీ మన దగ్గర నుంచి 23 మందిని లాక్కున్నారని విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండటమనేది చాలా ముఖ్యం అని చెప్పారు. ప్రజలకు సమస్య వచ్చినప్పుడు తోడుగా నిలబడాలి అని మంచి పలకరింపు అన్నది కూడా చాలా ముఖ్యం అని తెలిపారు. ఇవి చేయగలిగితే.. లీడర్ గా ఎదుగుతారు అని జగన్ స్పష్టం చేశారు.

# ఆంధ్రప్రదేశ్‌లో బిజెపిని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతా

## - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్

అమరావతి జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రప్రదేశ్ లో బిజెపిని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పి.వి.ఎన్ మాధవ్ తెలిపారు. పదవి అనేది గొప్పస్థానం కాదని, అదొక బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా విజయవాడ బిజెపి రాష్ట్ర కార్యాలయం లో ఆయన మాట్లాడుతూ.. కార్యకర్త గర్వపడేలా బిజెపిని తీర్చిదిద్దుతానని తెలియజేశారు. తన చిన్న వయసులో దేశంలో ఎమర్జెన్సీ విధించారని, ఎమర్జెన్సీ సమయంలో తన తల్లితో పాటు తాను జైలుకెళ్లాను అని ఆవేదనను వ్యక్తం చేశారు. అందరితో కలిసి బిజెపిని బలంగా మారుస్తాం అని మాధవ్ పేర్కొన్నారు.

# మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి : తాసీల్దార్ మల్లికార్జునరావు



మహబూబ్‌నగర్,జులై 1: ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని గండీడ్ తాసీల్దార్ మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సల్కరిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. వంటశాలలో పరిశుభ్రత పాటించి నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలన్నారు. మెనూ ప్రకారం వడ్డించలేని వారిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపనట్లు తెలిపారు.

ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మండల విద్యాధికారికి లేదా తమకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం వానాకాలం నేపథ్యంలో అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది కావునా, కుళాయిల వద్ద పరిశుభ్రతను పాటించాలన్నారు. భోజనానికి ముందు ప్రతి విద్యార్థి చేత చేతులు, ప్లేట్స్ పరిశుభ్రంగా కడిగిన తర్వాతే భోజనాన్ని అందించాలన్నారు. భోజనం వడ్డించే ముందు పరిశుభ్రంగా చేతులు కడుక్కొని వారికి అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జనార్ధన్ పాల్గొన్నారు.

# పెద్దల సంరక్షణపై పిల్లలకు కర్తవ్య బోధన

## -మోత్కూరు లో కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు
## - విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు
## -జిల్లా టాస్కా ఆదేశంతో మోత్కూరు శాఖ కార్యచరణ



యాదగిరిగుట్ట, జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: నానాటికీ సీనియర్ సిటిజన్స్ ( వయోవృద్ధులు) పై పెరుగుతున్న వేధింపులు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. తమ పిల్లలకు మంచి చదువులు చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని కోరుకుంటూ ప్రతి తల్లిదండ్రి తన కుటుంబ పోషణ గురించి ఎంతో కష్టపడతారు. తీరా వృద్ధాప్యం లో పిల్లలు పట్టించుకోక పోతే వారి బాధలు వర్ణనాతీతం. ఈ విషయమై యాదాద్రి భువనగిరి జిల్లా టాస్కా ( తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్) వినూత్న ఆలోచన చేసింది. ఈ విషయంపై చిన్నప్పటినుంచే పిల్లలలో అవగాహన కల్పించాలని నిర్ణయించుకుంది. ఇక కార్యాచరణకు దిగింది. " వయోవృద్ధులపై వేధింపులు - సంరక్షణ" అనే అంశాన్ని ఎన్నుకుంది. జిల్లా టాస్కా కమిటీ ఆదేశంతో మోత్కూరు మండల టాస్కా కమిటీ రంగంలోకి దిగింది. మోత్కూరు లో ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ప్రిన్సిపల్ మేడమ్ ప్రభా జస్టిస్ నేతృత్వంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంతో పోటీపడి రాశారు. ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందివ్వాలని నిర్ణయించారు. ఈ అరుదైన కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు విజయలక్ష్మి, మంజుల, లావణ్య ఎంతగానో తోడ్పడ్డారు. మండల టాస్కా బాధ్యులు ప్రధాన కార్యదర్శి అవిశెట్టి అవిలిమల్లు, అధ్యక్షుడు సూరోజు భాస్కరాచారి, కోశాధికారి యమగాని బుగ్గయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక పెద్దల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

# డాక్టర్లు ప్రత్యక్ష దేవుళ్లు.. వారి పరిరక్షణ బాధ్యత ప్రజలదే

## -డాక్టర్స్ డేలో సుమన్ మోహన్ రావు



జగిత్యాల, జులై 1 : వైద్యుల పరిరక్షణ బాధ్యత ప్రజలదేనని, ప్రాణాలు పణంగా పెట్టి రోగులకు సేవలందిస్తున్నామని మాతా శిశు కేంద్ర జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ సుమన్ మోహన్ రావు అన్నారు.

మంగళవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్ర సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రిలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ, ఆర్ఎంపి, పీఎంపీ శాఖల ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందిస్తున్న మాతా శిశు కేంద్ర, మెడికల్ కాలేజీ, ఐఎంఏ అసోసియేషన్ డాక్టర్లను సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, ఆర్ఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజా గోపాల్ చారిలు ఘనంగా సన్మానించారు. మాతా శిశు సూపరింటెండెంట్ సుమన్ మోహన్ రావు, ఆర్ఎంవోలు డాక్టర్లు గీతిక, శ్రీపతి, విజయా రెడ్డి, నరేష్, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, ప్రొఫెసర్లు రఘు, ప్రవీణ్, అర్చన, శిల్ప, ప్రదీప్, స్రవంతి, సింధూజలను, ఐఎంఏ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. హేమంత్, ప్రధాన కార్యదర్శి ఏ శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ట్రెజరర్ సుధీర్, దంత వైద్యుడు డాక్టర్ హరి విక్రమ్లను పట్టు శాలువాలతో, విశిష్ట సేవా పురస్కారాలతో సన్మానించారు.

ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. డాక్టర్లు ప్రత్యక్ష దేవుళ్లని, తెలంగాణను ఆరోగ్య తెలంగాణ మార్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ చేపట్టడం హర్షణీయమన్నారు. మాతా శిశు కేంద్రం, ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలల్లో, ప్రైవేట్ ఆసుపత్రుల్లో, ఐఎంఎ ఆధ్వర్యంలో డాక్టర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు.

జగిత్యాల జిల్లా మెడికల్ హబ్‌గా మారడంతో జిల్లా ప్రజలకి ప్రభుత్వం తరపున ఆరోగ్యశ్రీ కింద ఉచిత డయాలసిస్ సేవలు, 60 రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా అందజేస్తున్నారని డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజేన్స్ ఉపాధ్యక్షుడు పి హన్మంత రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కే సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి దిండిగాల విఠల్, మాతా శిశు కేంద్ర, డాక్టర్లు, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, నర్సింగ్ సిబ్బంది, వైద్య సిబ్బంది, సీనియర్ సిటిజేన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతలు త్వరితగతిన పూర్తి చేయాలి : జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు

నల్గొండ, జులై 1: గ్రామాల్లో మురుగునీరు వీధుల్లో ప్రవహించకుండా ఏర్పాటు చేసే ఇంకుడు గుంతలను త్వరితగతిన పూర్తి చేయాలని జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.

కట్టంగూర్ మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం వద్ద డ్రైనేజీ సమీపంలో నిర్మించనున్న ఇంకుడు గుంత నిర్మాణ పనులకు మంగళవారం అధికారులతో కలిసి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 26 సోక్ పీట్స్ (ఇంకుడు గుంతలు) నిర్మించనున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ నుండి వచ్చే మురుగునీరు ఇంకుడు గుంతల్లోకి చేరడంతో పారిశుధ్యం మెరుగుపడడంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జానప్రకాశ్ రావు ఇన్‌చార్జి ఎంపీఓ చింతమల్ల చలపతి, ఏపీఓ కడెం రాంమోహన్, పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ గౌడ్, చిత్తలూరి జానకిరాములు, యర్కల సత్తయ్య పాల్గొన్నారు.




# ఐసోటీమ్ సేవలు అభినందనీయం

### -ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్




కరీంనగర్, జులై 1:అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని ఆపదలో ఉన్న రోగులకు మానవతా దృక్పథంతో రక్త దానం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న కరీంనగర్ పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవా సంస్థ అయిన ఐసో టీం సేవలు అభినందనీయమని, రక్తదానం కోసం దాతలు ముందుకు రావాలని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసోటీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త నమూనా నిర్ధారణ క్యాంపుకు గులాం అహ్మద్ హుస్సేన్ హాజరయ్యారు. గడచిన 20 సంవత్సరాలుగా ప్రజల రక్త నమూనాలను నిర్ధారించి, రక్త పరీక్ష క్యాంపులు నిర్వహిస్తున్న ఐసో టీం వ్యవస్థాపకుడు ఘనుశ్యామ్ ఓజా తో పాటు అతడి టీం సభ్యుల అభినందించారు. గడచిన కొద్ది సంవత్సరాలలో ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందించి వారి ప్రాణాలకు అండగా నిలుస్తున్న ఐసోటీమ్ సేవలు రాబోయే రోజుల్లో మరింత విస్తరించాలని కోరారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి రక్త నమూనా పరీక్షలు నిర్ధారణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసోటీమ్ సభ్యులు ముబశ్శిర్, రేవంత్, యూసుప్, ఇంతియాజ్, యునూస్, పలువురు డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే టికెట్ బుకింగ్‌లో భారీ మార్పు..

### -ఇకపై నచ్చిన సీటు బుక్ చేసుకోవచ్చు !
### -అందుబాటులోకి "రైల్ వన్" యాప్

న్యూఢిల్లీ, జులై 1:భారతీయ రైల్వే టిక్కెట్ బుకింగ్ వ్యవస్థలో మరో అడుగు ముందుకు వేసింది. ఇప్పటి వరకు ఐఆర్‌సీటీసీ వంటి ప్లాట్‌ఫామ్‌లలో టిక్కెట్ బుక్ చేస్తే సీటు ఆటోమేటిక్‌గా కేటాయించేవారు. అయితే. ఇకపై ప్రయాణికులు తమకు నచ్చిన కోచ్, సీటును స్వయంగా ఎంపిక చేసుకునే వెసులుబాటు రాబోతుంది.

ఈ మార్పు కోసం రైల్వే శాఖ "మోడరన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్"ను రూపొందిస్తోంది. 2025 డిసెంబర్ నాటికి ఇది పూర్తి స్థాయిలో అమలులోకి రానుంది. కొత్త సిస్టమ్‌లో ప్రతి బోగీకి సంబంధించిన డిజిటల్ సీటింగ్ మ్యాప్‌ను చూపించనున్నారు. ఖాళీగా ఉన్న సీట్లు, బుక్ అయినవేంటో స్పష్టంగా కనిపిస్తాయి. ప్రయాణికులు తమ అవసరాలకు అనుగుణంగా లోవర్ బర్త్, కిటికీ పక్కన సీట్లు, పక్కపక్కన బెర్తులు వంటి ఎంపికలు చేసుకోవచ్చు.

ఈ సౌకర్యం ప్రయాణికులకు అనేక లాభాలను అందించనుంది. కుటుంబంగా ప్రయాణించేవారు ఒకే కోచ్‌లో సీట్లు పొందే అవకాశాన్ని పొందుతారు. వృద్ధులు, గర్భిణీలు, పిల్లలతో ఉన్న తల్లులు తమ అవసరాల మేరకు సీటు ఎంచుకోవచ్చు. టిక్కెట్ బుకింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా మారడంతో, సందేహాలు, అసౌకర్యాలకూ చెక్ పడనుంది.

ఈ మార్పు ద్వారా రైల్వే టిక్కెట్ బుకింగ్ అనుభవం విమానయానానికి సమానంగా మారనుంది. ప్రయాణికుల ఇష్టాలకు అనుగుణంగా మారుతున్న ఈ పరిణామం భారతీయ రైల్వే టెక్నాలజీలో గేమ్ ఛేంజర్‌గా నిలవనుంది.

### రైల్వే సూపర్ యాప్ వచ్చేసింది..

రైల్వే శాఖ సేవలూ అన్ని ఒకే చోట లభించేలా రైల్ వన్ పేరిట దేశ ప్రజలకు కొత్తయాప్ అందుబాటులోకి తెచ్చింది. తొలుత స్వరైల్ పేరిట ఈ సూపర్ యాప్‌ను పరీక్షించిన రైల్వే శాఖ.. తాజాగా రైల్‌వన్ పేరుతో యాప్ ను పౌరులందరికీ అందుబాటులోకి తెచ్చింది.

రైల్ వన్ యాప్ తో (ఆండ్రాయిడ్, ఐఓఎస్) రిజర్వ్‌డ్/అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు, ప్లాట్‌ఫామ్ టికెట్లు, రైళ్ల ఎంక్వైరీ, పీఎన్ఆర్, జర్నీ ప్లానింగ్, రైల్ మదత్, ఫుడ్ ఆన్ ట్రైన్ వంటి అన్ని సేవలు పొందవచ్చు.

# కథా వస్తువు చిన్నదైనా హృదయంలో చెరగని ముద్రగా రాజుగారి రచనలు

హైదరాబాద్, జులై 1: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి, తెలుగు అధ్యయన శాఖ వారు నేడు నిర్వహించిన తెలుగు సాహితీ సమితి కార్యక్రమం ద్విగ్విజయంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ ఆర్ సి కృష్ణస్వామి రాజు గారి రచన వ్యాసంగాన్ని మొదలుపెట్టి 20 పుస్తకాలు వెలువరించారని తెలిపారు. తన చుట్టూ ఉన్న పల్లె జీవితాలను, తాను చూసిన విషయాలను రచనలలో పొందుపరిచారన్నారు. రాజుగారి రచనలు ఆహ్లాదకరంగా ఉంటాయని, విద్యార్థులు రచనలు చదివి మెరుగుపడాలని ఆకాంక్షించారు. ప్రతి సృజన కారునిలో చిన్నపిల్లల మనసు ప్రస్ఫుటిస్తుందని, రాజుగారి రచనల్లో అది విశేషంగా స్ఫురిస్తుందని తెలిపారు. కథా వస్తువు చిన్నదైనా హృదయంలో చెరగని ముద్రగా వారి రచనలు ఉన్నాయని కొనియాడారు.

సాహితీ సమితి సలహాదారు డా. వై.సుభాషిణి మాట్లాడుతూ "తెలుగు కథా సాహిత్యం– గ్రామీణ జీవితం" మాట్లాడటానికి విచ్చేసిన కృష్ణస్వామిరాజుగారిని ప్రస్తావిస్తూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందడానికి సాహితీ సమితి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం ఎంతో అవసరమని, దానికి ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు.

వక్తగా విచ్చేసిన రచయిత ఆర్.సి. కృష్ణస్వామి రాజు "తెలుగు కథా సాహిత్యం – గ్రామీణ జీవితం" అనే అంశంపై మాట్లాడుతూ తెలుగు విద్యను అభ్యసించడానికి ప్రస్తుత తరంవారు వెనకడుగు వేస్తున్నారని తెలుగు సాహిత్యం చదవాలంటే ఎంతో అదృష్టం కలిగి ఉండాలని తెలిపారు.

రూపాయిలో ఉండే బొమ్మ, బొరుసులో బొమ్మ– సాహిత్యం, బొరుసు– సమాజమన్నారు.

"గాండ్ల మిట్ట"అనే రచనపై ప్రసంగిస్తూ గ్రామీణ జీవనంలో ఆర్థిక ఇబ్బందులను అందులోని విలువలను తెలియపరిచారు. సమాజానికి సాహిత్యానికి గల అవినాభావ సంబంధం "ఫుల్ మీల్స్"రచనలో ఉందని పేర్కొన్నారు. "గురుదేవోభవ" అనే రచనలో గురువు గొప్పతనాన్ని, "కోడుగుడ్డు కథ" కథలోని తల్లి ప్రేమను తెలియజేశారు. "అమ్మ సినిమాకి వెళ్లాలంటోంది" అనే కథలో సమాజంలో ప్రస్తుతం ఉద్యోగం చేసే పిల్లలు తల్లిదండ్రులతో సమయం కేటాయించాలని కోరుకొనే విధానాన్ని వ్యక్తపరిచారు. "గోల్కొండను చూసి వద్దాం రారండి" అనే రచనలో సమాజాభివృద్ధి విస్తృతంగా సాగుతుందని తద్వారా మనుషుల్లో సాహిత్యం ఎవరిని ఎలా కదిలిస్తుందో తెలియదన్నారు. తెలుగు విద్యార్థులు మట్టిలో మాణిక్యాలుగా వెలుగొందాలని ఆకాంక్షించారు. సమాజంలో తెలుగు విద్యార్థులకున్న విభిన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని కాంక్షించారు.

సాహితీ సమితి ఉపాధ్యక్షులు జి.వాణి స్వాగతం పలుకగా; అధ్యక్షులు ఎ.ప్రనూష వక్తను పరిచయం చేశారు. కార్యదర్శి బి.శిరీష వందన సమర్పణ చేయగా, కోశాధికారి ఎ.మోహిత నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో డా. బి. లక్ష్మీప్రియ, పరిశోధక విద్యార్థినులు, మహిళా అధ్యయన విభాగం పరిశోధక విద్యార్థినులు, పుర ప్రముఖులు విద్యాసాగర్ గారు, తెలుగుశాఖ విద్యార్థినులు పాల్గొన్నారు.




# అల్ఫోర్స్ లో జాతీయ వైద్యుల, చార్టెడ్ అకౌంటెంట్స్ దినోత్సవ వేడుకలు



కరీంనగర్, జులై 1:(నేటినిజం ప్రతినిధి) వైద్య వృత్తి ఆదర్శనీయమైనదని, మానవజాతికి ఒక గొప్ప వరం లాంటిది అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ లో, అల్ఫోర్స్ గర్ల్స్ హై స్కూల్ లో వేడుకగా నిర్వహించినటువంటి డాక్టర్స్ డే, చాంటెడ్ అకౌంటెంట్స్ డే ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై, వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా. బీసీ రాయి జయంతిని పురస్కరించుకుని భారత దేశవ్యాప్తంగా డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించడం చాలా హర్షించదగ్గ విషయమని, వారు చేసిన సేవలకు భారతదేశ ప్రభుత్వం గుర్తించి వారి పేరిట ఈ వేడుకలను నిర్వహించడం ద్వారా వైద్య వృత్తిని సమాజంలో గుర్తించబడినదని తెలిపారు. వైద్యులు అన్ని వేళల్లో సేవలు అందిస్తూ కుటుంబాలను సైతం లెక్కచేయకుండా అంకితభావంతో మానవజాతికి వారు చేసేటువంటి సేవలు ఎనలేనివని, ప్రశంసనీయమైనవని కొనియాడారు. ప్రస్తుత ప్రపంచంలో మానవాళికి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించడమే లక్ష్యంగా వైద్యులు కృషి చేస్తున్నారని, ముఖ్యంగా పౌష్టికార ఆహారం అందించడం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తూ చెరగని ముద్ర వేసుకుంటున్నారని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు. వేడుకలలో భాగంగా చిన్నారులు వివిధ వైద్య వృత్తిలోని వివిధ విభాగాల విశిష్టతను చాలా చక్కగా వర్ణించి ఆలోచింప చేశారు. ముఖ్యంగా వైద్యులు అందిస్తున్నటువంటి సహాయాలను నృత్యం ద్వారా ప్రదర్శించిన విధానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వైద్య వృత్తికి వన్నెతెస్తున్న వైద్యులకు పూల మొక్కలను అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ



రాజన్న సిరిసిల్ల, జులై 1:(నేటినిజం ప్రతినిధి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావును హైదరాబాద్ లోనీ వారి నివాసంలో రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు డాక్టర్ రాపెల్లి శ్రీధర్, సీనియర్ నాయకులు రేగుల మల్లికార్జున్, సనీటి మహేష్, కృష్ణ స్వామి, రేగుల శ్రీకాంత్‌మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో కలిసి నూతనంగా ఎన్నికైన రాష్ట్ర బిజెపి రథసారథి రామ్ చందర్ రావుకి రాజన్న లడ్డు ప్రసాదం అందజేసి, శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు.

# కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చ

### – దాదాపు 100 మంది ఎమ్మెల్యేలు శివకుమార్‌కు మద్దతు

బెంగుళూర్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ముఖ్యమంత్రి మార్పుపై దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రి పీఠంపై డీకే శివకుమార్ సీఎం సిద్ధరామయ్య ఇద్దరూ చెరో రెండున్నరేళ్లు ఉంటారని సమాచారం. ఈ క్రమంలో అక్టోబర్ లో రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని కొందరు కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా చెబుతున్నారు.

ఈ వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ ఇన్‌చార్జ్, ఆ పార్టీ జనరల్ సెక్రటరీ రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా కర్ణాటక పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన పార్టీ ఎమ్మెల్యేలతో కూడా సమావేశం కానున్నట్లు తెలిసింది. ఈ గందరగోళం వేళ ఉప ముఖ్యమంత్రి డీకేకి సన్నిహితుడిగా పేరొందిన ఓ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మెజారిటీ ఎమ్మెల్యేలు 'మార్పు' కోరుకుంటున్నట్లు చెప్పారు. దాదాపు 100 మంది ఎమ్మెల్యేలు శివకువ వార్‌కు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడు తూ.. 'నేను ఒక్కడిని కాదు.. మెజారిటీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి మార్పు కోరుకుంటున్నారు. 100 మందికిపైగా ఎమ్మెల్యేలు డీకే శివకుమార్‌కు మద్దతు ఇస్తున్నారు. వారిలో చాలా మంది మార్పు కోసం ఎదురుచూస్తున్నారు. మంచి పాలన కోరుకుంటున్నారు. సిద్ధరామయ్యను తొలగించి.. డీకే శివకుమార్‌ను సీఎంని చేయాలి. ఆయన పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేశారు. పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. కేపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి అందరూ చూశారు. అందుకే మెజారిటీ ప్రజలు ఆయన్నే సీఎంగా కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రి మార్పు అంశం గురించి నేను సుర్జేవాలాతో మాట్లాడతాను. ఇప్పుడు మార్పు జరగకపోతే.. 2028లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారాన్ని నిలుపుకోలేదు. ప్రస్తుతం పార్టీ ప్రయోజనాల దృష్ట్యా సీఎం మార్పు చాలా అవసరం' అని అన్నారు.

# కాళేశ్వరం కూలేశ్వరంగా మారింది.. మంత్రి సీతక్క ఎద్దేవా



నిజామాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బిఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన మూడేళ్లకే కాళేశ్వరం కూలేశ్వరంగా మారిందని ఇంఛార్జ్ మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. మంగళవారం నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని నాశనం చేసిందని దుయ్యబట్టారు. 2014 తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ నిధులు, నియామకాలు అని చెప్పి నిధులన్నింటిని కెసిఆర్ కుటుంబసభ్యులు నీళ్లన్నీ ఫాంహౌస్ లోకి తరలించారని ఆరోపించారు. వరి వేస్తే రైతులకు ఉరి పడ్డట్టేనని అన్నారని, కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పండించిన రైతులకు రూ 500 బోనస్ ఇస్తుందని ప్రశంసించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలోని పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తుందని, అలాగే 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇళ్లకు కరెంట్ ఇస్తోందని కొనియాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం పదేళ్లలో కేవలం 60 వేల ఇళ్లు మాత్రమే మంజూరు చేసిందని, అందులో సగానికి పైగా బిల్లులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజల్లోకి వెళ్లే విధంగా ప్రతికార్యకర్త కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేయాలని తెలిపారు. గ్రూపు రాజకీయాలతో పార్టీ స్థాయి తగ్గిపోతుందని కార్యకర్తలు, నాయకులను హెచ్చరించారు.

# పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఘనంగా హారిక నాయుడు పుట్టినరోజు వేడుకలు



ఖమ్మం, జులై 1:(నేటినిజం ప్రతినిధి): మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఓబీసీ వైస్ చైర్మన్ హారిక నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు...నా పుట్టినరోజు సందర్భంగా ఆశీస్సులు, శుభాకాంక్షలు తెలియజేసిన నా సోదరులు, సోదరీమనులు, బంధువులు, మిత్రులు ప్రతి ఒకరికి వారందరికీ అలాగే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన నా వారందరికీ హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు నా ప్రతి అడుగులో నాకు తోడుగా ఉండి, నన్ను నడిపిస్తూ వెలకట్టలేని అభిమానాన్ని చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది అని ఆమె అన్నారు.

# 75 చరిత్ర సంవత్సరాల దేశ చరిత్ర లో సర్వోన్నత న్యాయస్థానం చారిత్రాత్మక నిర్ణయం

### – తొలిసారిగా సిబ్బందికి రిజర్వేషన్లు..!

న్యూ డిల్లీ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );75 చరిత్ర సంవత్సరాల చరిత్ర కలిగిన దేశ సర్వోన్నత న్యాయస్థానం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నది. తొలిసారిగా సిబ్బందికి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సిబ్బంది ప్రత్యక్ష నియామకం, పదోన్నతులను కల్పించేందుకు మొదటిసారిగా అధికారిక రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది. దాంతో సుప్రీంకోర్టులో నాన్–జ్యుడీషియల్ పోస్టులకు ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందనున్నారు. సుప్రీంకోర్టు రిజర్వేషన్ విధానం 23 జూన్ 2025 నుంచి అమలులోకి తీసుకువచ్చింది. ఇది భారత సుప్రీంకోర్టులో పరిపాలనా పనితీరులో భారీ మార్పునకు సంకేతంగా నిలుస్తున్నది.అయితే, ఈ రిజర్వేషన్లు న్యాయమూర్తులకు వర్తించదు. రిజిస్ట్రార్, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్, జూనియర్ కోర్ట్ అసిస్టెంట్, ఛాంబర్ అటెండెంట్ తదితర పోస్టులకు మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుంది. సుప్రీంకోర్టులో రిజర్వేషన్ కింద మూడు కేటగిరిలు ఉంటాయి.

అవి ఎస్సీ, ఎస్టీ, నాన్ రిజర్వ్‌డ్. రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ సంస్థలు, వివిధ హైకోర్టుల్లో రిజర్వేషన్ విధానం వర్తిస్తే.. సుప్రీంకోర్టు మాత్రమే ఎందుకు మినహాయింపుగా ఉండాలి? మన విలువలు.. మన చర్యలకు అద్దం పట్టాలన్నారు. జూన్ 24న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం, షెడ్యూల్డ్ కుల (ఎస్సీ) ఉద్యోగులకు సుప్రీంకోర్టులో 15 శాతం రిజర్వేషన్లు లభించనుండగా.. డ్యూల్డ్ తెగ (ఎస్టీ) వర్గానికి 7.5 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. రోస్టర్ లేదంటే రిజిస్టర్‌లో తప్పులు లేదా సరికాని వాటి గురించి ఉద్యోగులు ఎవరైనా అభ్యంతరాలు లేవనెత్తినట్లయితే వాటి గురించి రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్)కు తెలియుజేయవచ్చని సర్క్యులర్ పేర్కొంది.

# వనమహోత్సవంలో పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం : గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు



హైదరాబాద్, జులై 1: వనమహోత్సవంలో పండ్ల మొక్కల పెంపకానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు సూచించారు. హుజూరాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో హుజూరాబాద్, సైదాపూర్ , శంకరపట్నం మండలాల ఎంపీడీ వోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో మొక్కలు విరివిగా నాటాలని అన్నారు. హార్టికల్చర్ ద్వారా పండ్ల మొక్కల పెంపకానికి ఎక్కువ మంది రైతులను గుర్తించి మొక్కలు అందజేయాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఉప్పుల శ్రీధర్, సహాయ గ్రామీణ అభివృద్ధి అధికారి కృష్ణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఎంపీడీవోలు సునీత, యాదగిరి, కృష్ణ ప్రసాద్, మండల పంచాయతీ అధికారులు సతీష్ రావు, బసీరుద్దీన్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు, ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.